



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 12 సంచిక : 179 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం గురువారం 5 మార్చి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :12 ISSUE :179 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM THU 5 MARCH 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Visakhapatnam,Kakinada,Bapatla,NarasaraoPeta,Ongole,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur



## మమ్మల్ని యుద్ధంలోకి లాగొద్దు

ట్రంప్ వార్నింగ్‌పై స్పెయిన్ ప్రధాని కామెంట్

- ఇరాన్‌పై యుద్ధం ప్రకటిస్తున్న వారి లక్ష్యాల్లో స్పష్టత లేదన్న పెడ్రో సాంచెజ్
- ఇలాంటి రక్తపాతాన్ని స్పెయిన్ ఎన్నడూ కోరుకోలేదని వ్యాఖ్య
- యుద్ధాన్ని ఆపాలని పలు దేశాలు తీర్మానాలు చేశాయన్న సాంచెజ్

- మిగతా 2లో



## శ్రీలంక తీరంలో ఇరాన్ యుద్ధనౌకపై దాడి...? 101 మంది గల్లంతు...?

- శ్రీలంక తీరంలో మునిగిపోయిన ఇరాన్ నేవీ ఫ్రిగేట్ 'ఐరిస్ డెనా'
- వెంటనే స్పందించి 30 మందిని రక్షించిన శ్రీలంక నావికాదళం
- జలాంతర్గామి దాడి వల్లే నౌక మునిగిందని అనుమానాలు
- 101 మంది సిబ్బంది ఆచూకీ గల్లంతైందన్న వార్తలపై గందరగోళం

- మిగతా 2లో

# వర్సిటీలను బంధుగణంతో నింపేసి భ్రష్టుపట్టించారు

- ప్రభుత్వ బడిలోని విద్యార్థిని సొంత బిడ్డలా భావించాలన్న నారా లోకేశ్
- జీవో 117తో గత పాలకులు విద్యావ్యవస్థను కుప్పకూల్చారని ఆగ్రహం
- యూనివర్సిటీల వీసీలుగా బంధువులు, అర్హత లేనివారేనని ఆరోపణలు
- టీచర్లను వైన్ షాపుల కాపలాకు వాడిన దుస్థితి గతానిది అంటూ విమర్శలు
- త్వరలో మెగా డీఎస్సీ తరహాలో అధ్యాపక పోస్టుల భర్తీ చేస్తామని ప్రకటన



**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్ విద్యావ్యవస్థను దేశానికే ఆదర్శంగా నిలిపేలా 'ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్'ను ప్రపంచానికి చాటుదామని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. శాసనసభలో విద్యాశాఖ బడ్జెట్ డిమాండ్ల ప్రతిపాదనల సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో విద్యారంగంలో జరిగిన విధ్వంసం, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం చేపడుతున్న సంస్కరణలను సవివరంగా వెల్లడించారు. రాజకీయాలకు అతీతంగా ప్రజాప్రతినిధులందరూ ప్రభుత్వ పాఠశాలలను దత్తత తీసుకుని, వాటి బలోపేతానికి కృషి చేయాలని కోరారు.

**గత పాలనలో విధ్వంసం - విద్యావ్యవస్థ కుదేలు**

గత వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో విద్యాశాఖలో కోలుకోలేని విధ్వంసం జరిగిందని లోకేశ్ తీవ్ర విమర్శలు చేశారు. అనాలోచితంగా తీసుకొచ్చిన జీవో 117 వల్ల ప్రభుత్వ పాఠశాలలు తీవ్రంగా నష్టపోయాయని, వ్యవస్థ మొత్తం కుప్పకూలిందని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఐదేళ్లలో ఏకంగా 10 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలకు దూరమయ్యారని గణాంకాలతో సహా వివరించారు. డ్రాప్ బాక్సుల విధానాన్ని దుర్వినియోగం చేసి, సుమారు 3 లక్షల మంది పిల్లల పేర్లతో మధ్యాహ్న భోజనం, కిట్ల నిధులను డ్రా చేసుకున్నారని ఆరోపించారు. కేవలం నంబర్లను మేనేజ్ చేయడానికే గత పాలకులు పరిమితమయ్యారని మండిపడ్డారు.

**అధఃపాతాళానికి పడిపోయిన ప్రమాణాలు**

గత ప్రభుత్వ చర్యల వల్ల విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు (లెర్నింగ్ అవుట్ కమ్స్) దారుణంగా పడిపోయాయని మంత్రి తెలిపారు. 2018లో 5వ తరగతి పిల్లలు గ్రేడ్-2 తెలుగును 57 శాతం మంది అర్థం చేసుకోగలిగితే, గత ప్రభుత్వంలో అది 37 శాతానికి పడిపోయిందన్నారు. నేషనల్ ఎచీవ్‌మెంట్ సర్వేలో 3వ తరగతి లాంగ్వేజ్ విభాగంలో ఏపీ 1వ ర్యాంకు నుంచి 27వ ర్యాంకుకు, మ్యాథ్స్‌లో 5వ ర్యాంకు నుంచి 21వ ర్యాంకుకు పడిపోవడం గత పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. ఉపాధ్యాయులను వైన్ షాపుల వద్ద కాపలాకు పెట్టి అవమానించారని, ఐదేళ్లలో ఒక్క టీచర్ పోస్టు కూడా భర్తీ చేయలేదని లోకేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

**సంస్కరణల బాటలో ప్రజాప్రభుత్వం**

కూటమి ప్రభుత్వం వచ్చాక విద్యాశాఖలో ప్రక్షాళన మొదలైందని లోకేశ్ తెలిపారు. జీవో 117 రద్దు చేసి, సింగిల్ టీచర్ విధానానికి

- మిగతా 2లో

### యూనివర్సిటీల్లో బంధుగణం - అక్రమ నియామకాలు

విశ్వవిద్యాలయాలను గత ప్రభుత్వం రాజకీయ పునరావాస కేంద్రాలుగా మార్చిందని మంత్రి ధ్వజమెత్తారు. వర్సిటీల్లో ఫ్యాకల్టీ నియామకాలను గాలికొదిలేసి, వీసీలుగా బంధువులను, అర్హత లేనివారిని నియమించి భ్రష్టుపట్టించారని విమర్శించారు. ఏయూ వీసీగా ప్రసాదరెడ్డిని నియమించి విద్యార్థులను రోడ్లపై నిలబెట్టారని, అర్హత లేకపోయినా మాజీ సీఎం బంధువు సుందరవల్లిని ఎస్వీయూ రెక్టార్ గా, విక్రమ సింహపురి వర్సిటీ వీసీగా నియమించారని ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా శ్రీకాంత్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, సురేంద్రనాథ్ రెడ్డి వంటి బంధువర్గానికి పదవులు కట్టబెట్టారని పేర్లతో సహా బయటపెట్టారు. వర్సిటీల్లో విగ్రహాలు పెట్టి, ఫ్లెక్సీలు కట్టి పవిత్రతను దెబ్బతీశారన్నారు. అంతేకాకుండా రూ.4 వేల కోట్ల ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు పెట్టి వెళ్లిపోయారని తెలిపారు.

## చిత్తూరు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

పలమనేరు వద్ద లారీని ఢీకొన్న కారు

అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయిన ఐదుగురు

మృతుల్లో ముగ్గురు మహిళలు

మృతులు కర్ణాటకకు చెందిన వారిగా గుర్తింపు



**పెన్ పవర్ డెస్క్:**చిత్తూరు జిల్లా పలమనేరు సమీపంలో ఈ ఉదయం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం తీవ్ర విషాదాన్ని నింపింది. జాతీయ రహదారిపై అతివేగంగా వెళ్తున్న కారు, ముందు వెళ్తున్న లారీని వెనుక నుంచి బలంగా ఢీకొనడంతో ఈ ప్రమాదం సంభవించింది. ఈ భీకర సంఘటనలో కారులో ప్రయాణిస్తున్న ఐదుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మృతులలో ఇద్దరు పురుషులు, ముగ్గురు మహిళలు ఉన్నట్లు పోలీసులు ధ్రువీకరించారు.ప్రమాద ధాటికి కారు పూర్తిగా నుజ్జునుజ్జు అయిపోయింది. సమాచారం అందుకున్న వెంటనే పలమనేరు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మృతులంతా కర్ణాటక రాష్ట్రానికి చెందిన వారుగా ప్రాథమిక

- మిగతా 2లో

## హైదరాబాద్ లో భారీగా కల్తీ నెయ్యి స్వాధీనం

- బంజారాహిల్స్ పరిధిలోని ఒక నివాస ప్రాంతంలో కల్తీ నెయ్యి దందా
- గుట్టును రట్టు చేసిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు
- 460 కిలోల కల్తీ నెయ్యి స్వాధీనం



**పెన్ పవర్ డెస్క్:**హైదరాబాద్ నగర నడిబొడ్డున సాగుతున్న కల్తీ నెయ్యి దందా గుట్టును టాస్క్‌ఫోర్స్ పోలీ సులు రట్టు చేశారు. బంజారాహిల్స్ పరిధి లోని ఒక నివాస ప్రాంతంలో గుట్టుచప్పుడు

- మిగతా 2లో



## టెహ్రాన్ సమీపంలో భూగర్భ స్థావరంలో అణుప్రాజెక్టును ధ్వంసం చేశాం

- రహస్య భూగర్భ అణు ప్రాజెక్టును ధ్వంసం చేసినట్లు ఐడీఎఫ్ వెల్లడి
- ఇక్కడ శాస్త్రవేత్తలు రహస్యంగా పని చేస్తున్నట్లు సమాచారం అందిందని వెల్లడి
- పక్కా సమాచారంతో దాడి చేశామన్న ఇజ్రాయెల్ రక్షణ దళం

**పెన్ పవర్ డెస్క్:**ఇరాన్‌లోని రహస్య భూగర్భ అణు ప్రాజెక్టును ధ్వంసం చేశామని ఇజ్రాయెల్ రక్షణ దళం (ఐడీఎఫ్) ప్రకటించింది. రాజధాని టెహ్రాన్ సరిహద్దుల్లోని మింజాదేహైలో రహస్యంగా ఏర్పాటు చేసిన ఈ అణు ప్రాజెక్టుపై దాడి చేసినట్లు ఐడీఎఫ్ అధికార ప్రతినిధి డెఫ్రిన్ వెల్లడించారు. ఇక్కడ శాస్త్రవేత్తలు రహస్యంగా పనిచేస్తున్నట్లు సమాచారం అందిందని, దీనితో దాడి జరిపినట్లు ఐడీఎఫ్ తెలిపారు. 2025లో అమెరికా దాడుల తర్వాత ఇరాన్ తన అణు కార్యక్రమాన్ని ఇక్కడకు మళ్లించిందని వెల్లడించారు. గత ఏడాది జూన్ నెలలో ఇరాన్‌పై 'ఆపరేషన్ రైజింగ్ లయన్' పేరుతో 12 రోజుల పాటు దాడులు చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఆ రోజు దాడికి ఉపయోగించిన మందుగుండు సామాగ్రి కంటే ఈ నాలుగు రోజుల్లో ఉపయోగించిందే ఎక్కువ అని తెలిపారు. గతంలోనే ఇరాన్ అణుస్థావరాలపై తాము దాడులు చేశామని డెఫ్రిన్ తెలిపారు.

- మిగతా 2లో




## రెండు కీలక బిల్లులకు ఆమోదం తెలిపిన ఏపీ శాసనమండలి

- అసైన్డ్ భూముల బిల్లు.. గ్రామ, వార్డు సచివాలయాల బిల్లులకు ఆమోదం
- అసైన్డ్ భూములను క్లీన్ ఎనర్జీ ప్రాజెక్టులకు లీజుకు ఇచ్చే అవకాశం
- గ్రామ, వార్డు సచివాలయాల పేరు మార్పు

- మిగతా 2లో

## ఇరాన్ కొత్త సుప్రీం లీడర్‌గా మట్నజ్తబా ఖమేనీ..



**పెన్ పవర్ డెస్క్:**ఇరాన్ రాజకీయాల్లో అనూ హ్య మార్పు లు చోటుచేసు కుంటున్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో ఇరాన్ కొత్త సుప్రీం లీడర్‌గా అలీ ఖమేనీ

- మిగతా 2లో

## హిందుత్వం గురించి మాట్లాడే అర్హత జగన్‌కు లేదు



- నీ జీవితంలో నీ భార్యతో కలిసి తిరుమలకు రాలేవు.. ఎందుకంటే!: జగన్‌పై బీఆర్ నాయుడు ఫైర్
- అన్యమతస్తుల తొలగింపు నిర్ణయంతోనే తనపై కుట్రలు చేస్తున్నారని ఆరోపణ
- జగన్ భార్యతో కలిసి తిరుమలకు వస్తేనే జనం నమ్ముతారని స్పష్టీకరణ

- మిగతా 2లో

## వచ్చే ఎన్నికల్లో 70కి పైగా సీట్లు కావాలి.. 21 ఇస్తే ఒప్పుకోం



- వచ్చే ఎన్నికల్లో 70కి పైగా స్థానాల్లో పోటీ చేయడం ఖాయమని జనసేన నేత కిరణ్ రాయల్ వెల్లడి
- 21 సీట్లతో సరిపెట్టుకునే ప్రసక్తే లేదని స్పష్టీకరణ
- పవన్ కల్యాణ్ లేకుంటే కూటమి అధికారంలోకి వచ్చేది కాదని వ్యాఖ్య
- చంద్రబాబు జైల్లో ఉన్నప్పుడు పవనే టీడీపీకి అండగా నిలిచారన్న కిరణ్ రాయల్

- మిగతా 2లో

- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

# ఈ బాణాసంచా మేధం ఇంకా ఎన్నాళ్లు?

ఇటీవల వేట్లపాలెంలో చోటుచేసుకున్న భారీ బాణసంచా పేలుడు మరోసారి మనలను ఆలోచనలో పడేసింది. ఆనందానికి ప్రతీకగా నిలిచే బాణసంచా వెనుక ఎంతటి ప్రమాదం దాగి ఉందో ఈ ఘటన ఘోరంగా గుర్తు చేసింది. ఉదయం ఇంటి నుంచి బయలుదేరిన కార్మికులు సాయంత్రం సురక్షితంగా తిరిగి వస్తారని ఎదురు చూసిన కుటుంబాలకు అందింది మాత్రం కన్నీటి వార్త. బాణసంచా పరిశ్రమ గ్రామీణ ప్రాంతాల్లో వేలాది కుటుంబాలకు జీవనాధారం. పరిమిత ఉపాధి అవకాశాలున్న ప్రాంతాల్లో రోజువారీ ఆదాయం కోసం ప్రజలు ఈ రంగాన్ని ఆశ్రయించడం సహజం. వ్యవసాయం సీజనల్‌గా ఉండడం, ప్రత్యామ్నాయ పరిశ్రమల కొరత, అప్పుల భారాలు.. ఇవన్నీ కలిసి కార్మికులను ప్రమాదం తెలిసినా అదే పనిలో కొనసాగించేలా చేస్తున్నాయి. జీవనోపాధి అవసరం ముందు భద్రత తరచూ వెనుకబడిపోతోంది. ఇలాంటి ప్రమాదాలు కొత్తవి కావు. తమిళనాడులోని శివకాశి, విరుదునగర్ ప్రాంతాల్లో గతంలో జరిగిన వరుస బాణసంచా పేలుళ్లు ఇదే వాస్తవాన్ని పలుమార్లు మన ముందుంచాయి. ప్రతి ప్రమాదం తర్వాత కఠిన చర్యల హామీలు వినిపిస్తాయి. విచారణలు జరుగుతాయి. బాధ్యులపై కేసులు నమోదవుతాయి. కానీ కొంతకాలం గడిచాక వ్యవస్థ మళ్లీ అలసత్వంలోకి జారిపోతుంది. ఫలితంగా మరో ప్రమాదం, మరో విషాదం. ప్రశ్న ఒకటే.. నేర్చుకున్న పాఠం ఎక్కడ? ముడి పదార్థాల నిల్వ పరిమితి, తయారీ ప్రక్రియలను వేర్వేరు యూనిట్లుగా విభజించడం, అగ్నిమాపక పరికరాల ఏర్పాటు, కార్మికుల సంఖ్యపై నియంత్రణ ఇవన్నీ చట్టాలలో స్పష్టంగా ఉన్నాయి. కానీ అమలు దశలోనే లోపాలు కనిపిస్తున్నాయి. కొందరు యజమానులు లాభాల కోసం అనుమతించిన పరిమితికి మించి రసాయనాలు నిల్వ చేయడం, ఒకే గదిలో అధిక సంఖ్యలో కార్మికులను పని చేయించడం, శిక్షణ లేకుండా కొత్త కార్మికులను నియమించడం, రక్షణ పరికరాల లోపం.. ఇవన్నీ ప్రమాదాలకు దారితీసే అంశాలే. ప్రభుత్వం తన బాధ్యతను మరింత కఠినంగా నిర్వర్తిం చాల్సిన సమయం ఇది. ఆకస్మిక తనిఖీలు క్రమం తప్పకుండా జరగాలి. ఉల్లంఘనలపై భారీ జరిమానాలు విధించాలి. అవసరమైతే లైసెన్సులు రద్దు చేయాలి. తనిఖీలను డిజిటల్ పద్ధతిలో పారదర్శకంగా నిర్వహించాలి. ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం సరిపోదు. ప్రమాదం జరగకుండా నిరోధించడమే నిజమైన పాలన. పరిశ్రమ యజమానులు కూడా ఆత్మపరిశీలన చేసుకోవాలి. భద్రతా పరికరాలు, శిక్షణ, మౌలిక సదుపాయాలు ఖర్చు కాదు.. బాధ్యత! యాంటీ-స్టాటిక్ దుస్తులు, గ్లౌవ్స్, మాస్కులు, కంటి రక్షణ పరికరాలు తప్పనిసరిగా వినియోగంలో ఉండాలి. ప్రతి యూనిట్‌లో అగ్నిమాపక పరికరాలు, స్పష్టమైన అత్యవసర నిష్క్రమణ మార్గాలు ఉండాలి. లాభాల కోసం భద్రతను పక్కన పెట్టడం తాత్కాలిక లాభం కావచ్చు. కానీ అది శాశ్వత నష్టం. ప్రమాదకర దశల్లో మానవ జోక్యాన్ని తగ్గించడం అత్యవసరం. రసాయనాల మిశ్రమం, ప్యాకింగ్ వంటి సున్నిత దశల్లో ఆటోమేటెడ్ యంత్రాలను వినియోగించడం ద్వారా ప్రమాద అవకాశాలు తగ్గించవచ్చు. ఉష్ణోగ్రత, తేమ, వాయు ఒత్తిడి మార్పులను గుర్తించే సెన్సర్ వ్యవస్థలు అమలు చేస్తే ముందస్తు హెచ్చరికలు అందుతాయి. ప్రమాదం జరిగిన తర్వాత ఇచ్చే పరిహారం తాత్కాలిక ఉపశమనం మాత్రమే. అభివృద్ధి అంటే కేవలం ఉత్పత్తి,?ఆర్థిక గణాంకాలు పెరగడం కాదు. ప్రతి కార్మికుడు సురక్షితంగా ఇంటికి చేరుకోవడం కూడా ముఖ్యమైనది. ప్రాణ భద్రత లేకుండా అభివృద్ధి అనే మాట ఖాళీ నినాదంగా మారిపోతుంది. వేట్లపాలెం ఘటన మరోసారి మనకు హెచ్చరిక ఇచ్చింది. ఈసారి అయినా మార్పు తీసుకురాగలమా లేక మరో ప్రమాదం కోసం వేచి చూస్తామా? వెలుగులు ఆనందానికి ప్రతీకలు కావాలి. కానీ ఆ వెలుగుల వెనుక కార్మికుల ఇళ్లలో శాశ్వత చీకట్లు మిగలకూడదు. నరాల బిగువుతో ప్రపంచాన్ని నిలబెట్టే శ్రమజీవి ప్రాణమే నిజమైన సంపద. ఆ ప్రాణాన్ని కాపాడే విధానాలే నిజమైన అభివృద్ధి మార్గం.

# హిందుత్వం గురించి మాట్లాడే అర్హత జగన్‌కు లేదు

వైసీపీ అధినేత జగన్ పై తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఛైర్మన్ బీఆర్ నాయుడు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఇటీవల చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో సోషల్ మీడియా వేదికగా ఆయన జగన్‌ను ప్రశ్నిస్తూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. హిందుత్వం గురించి గానీ, శ్రీవారి గురించి గానీ మాట్లాడే నైతిక అర్హత జగన్‌కు లేదని ఆయన స్పష్టం చేశారు. ఇది జగమెరిగిన సత్యం అంటూ ఈ మేరకు ట్వీట్ చేశారు."హిందుత్వం గురించి మాట్లాడే అర్హత నీకు లేదు. దేవదేవుడు శ్రీ వేంకటేశ్వర స్వామి వారి గురించి నువ్వు మాట్లాడతావా జగన్..? ఆయన పేరు ఉచ్ఛరించే అర్హత, నైతికత నీకుందా? హిందూ వ్యతిరేకి అయిన నువ్వు సీఎంగా ఉన్నావనే కదా నీ అనుచరులకి ధైర్యం..! అందుకే వైవీ సుబ్బారెడ్డి, భూమన కరుణాకరరెడ్డి రెచ్చిపోయి హిందూ మత ఔన్నత్యాన్ని మంటగలిపారు. ఒక పథకం ప్రకారం తిరుమల కొండపై యథేచ్ఛగా అన్యమత ప్రచారం చేశారు.
అన్యమతస్తుడవైన నువ్వు ఇప్పటివరకు దేవదేవునిపై విశ్వాసం ఉందని డిక్లరేషన్ ఎందుకు ఇవ్వలేదు? సీఎంగా ఉండగా నీ భార్యతో కలిసి గుడికి వచ్చి పట్టు వస్త్రాలిచ్చావా?... రాలేదే! నీ జీవితంలో నీ భార్యతో కలిసి తిరుమలకు రాలేవు.. ఎందుకంటే మీ ఇద్దరూ నమ్మేది ఏసుప్రభువునే కానీ, శ్రీ వేంకటేశ్వర స్వామిని కాదు కాబట్టి... ఇది ఒప్పుకో జగన్! నేను ఛైర్మన్ అయ్యాక ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచనల మేరకు టీటీడీని ప్రక్షాళన చేస్తున్నాం. నీ అండతో నీ బాబాయ్, భూమన చేసిన అవినీతి, అక్రమాలు బయట పడుతున్నాయనే నీ బాధంతా! టీటీడీలో అన్యమతస్తులు ఉండరాదని నేను నిర్ణయం తీసుకున్న నాడే నాపై పథకం ప్రకారం కుట్రలు ప్రారంభించావు. అందులో భాగంగానే కదా నాపై
డీప్ ఫేక్ వీడియోలు సృష్టించి తిరుమల ప్రతిష్ఠ దెబ్బతీయాలని చూశావు. శ్రీ వేంకటేశ్వర స్వామిని ఇంటిదైవంగా పూజించే చంద్రబాబుకు దేవదేవునిపై భక్తి లేదంటావా?చంద్రబాబు భార్యతో తిరుమలకు వస్తారు. నువ్వు హిందువువే అయితే భార్యతో తిరుమలకు రా...! అప్పుడు నిన్ను నమ్ముతారు. కానీ నువ్వు సతీసమేతంగా రాలేవు... నిన్ను ఎవ్వరూ నమ్మరు జగన్!" అంటూ బీఆర్ నాయుడు నిప్పులు చెరిగారు.

# వర్సిటీలను బంధుగణంతో నింపేసి భ్రష్టుపట్టించారు

- మొదటి పేజి తరువాయి
స్వస్తి పలికామన్నారు. కేవలం 150 రోజుల్లోనే మెగా డీఎస్సీ నిర్వహించి 16 వేల పోస్టుల భర్తీ చేపట్టామని గుర్తుచేశారు. మరోవైపు యూనివర్సిటీల్లోని న్యాయపరమైన చిక్కులను 90 రోజుల్లో తొలగించి, త్వరలోనే అధ్యాపక పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇస్తామని ప్రకటించారు. స్కూల్ కిట్స్, చిక్కీ, గుడ్ల సరఫరాలో అవినీతిని అరికట్టి రూ.1,000 కోట్లు ఆదా చేస్తున్నామని, ఈ నిధులను విద్యార్థుల సంక్షేమమేకే వెచ్చిస్తామని స్పష్టం చేశారు.

**ఎమ్మెల్యేలకు పిలుపు - టెక్నాలజీ వినియోగం**

ప్రతి ఎమ్మెల్యే తమ పరిధిలోని రెండు పాఠశాలలను దత్తత తీసుకోవాలని, ప్రతి వారం స్కూళ్లను సందర్శించి ఫీడ్ బ్యాక్ ఇవ్వాలని మంత్రి కోరారు. పిల్లల్లో 'పాసివ్ లెర్నింగ్' నుంచి 'యాక్టివ్ లెర్నింగ్' వైపు మార్పు తెచ్చేందుకు 'క్లిక్కర్ టెక్నాలజీ'ని ప్రవేశపెడుతున్నట్లు వెల్లడించారు. అమరావతిలో ప్రపంచస్థాయి సెంట్రల్ లైబ్రరీని ఏర్పాటు చేస్తున్నామని, ఇందుకోసం శోభా రియాలిటీ సంస్థ రూ.100 కోట్లు విరాళం అందించిందని సభకు తెలిపారు. చాగంటి కోటేశ్వరరావు గారి సలహాలతో పిల్లల్లో నైతిక విలువలు పెంచేలా చర్యలు తీసుకుంటున్నామని, అందరం కలిసి ఏపీని విద్యాహబ్‌గా మారుద్దామని మంత్రి లోకేశ్ ఆకాంక్షించారు.

# వచ్చే ఎన్నికల్లో 70కి పైగా సీట్లు కావాలి.. 21 ఇస్తే ఒప్పుకోం

ఏపీ రాజకీయాల్లో జనసేన తిరుపతి నియోజకవర్గ ఇంఛార్జి కిరణ్ రాయల్ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ 70కి పైగా స్థానాల్లో పోటీ చేయడం ఖాయమని, కేవలం 21 సీట్లు ఇస్తామంటే అంగీకరించే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. ఇటీవల ఓ యూట్యూబ్ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. 2024 ఎన్నికలతో పోలిస్తే జనసేన పార్టీ బలం గణనీయంగా పెరిగిందని, భవిష్యత్తులో సీట్ల సర్దుబాటులో ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాలని ఆయన పరోక్షంగా మిత్రపక్షాలకు సూచించారు.జనసేన అధినేత పవన్ కల్యాణ్ వల్లే ఏపీలో ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చిందని కిరణ్ రాయల్ అన్నారు. "పవన్ కల్యాణ్ లేకపోతే టీడీపీ ఎన్నికల బరిలో నిలబడటమే కష్టమయ్యేది. ఈ విషయంలో టీడీపీ నేతలకు నేను సవాల్ విసురుతున్నా" అని వ్యాఖ్యానించారు. రాజమండ్రి జైలులో చంద్రబాబు ఉన్నప్పుడు టీడీపీ శ్రేణులు దిక్కుతోచని స్థితిలో ఉంటే, పవన్ ముందుకొచ్చి కూటమి ఏర్పాటు చేసి వారికి ధైర్యం ఇచ్చారని గుర్తుచేశారు. ఆ క్లిష్ట సమయంలో పవన్ చూపిన చొరవ వల్లే కూటమి విజయం సాధించిందని, ప్రజలు పవన్ కల్యాణ్‌ను నమ్మి ఓట్లు వేశారని అభిప్రాయపడ్డారు.గత ఎన్నికల్లో తాను పోటీ చేయకపోవడానికి గల కారణాలను కూడా కిరణ్ రాయల్ వివరించారు. రాజకీయాల్లో ప్రజాబలంతో పాటు ఆర్థిక బలం కూడా అవసరమని, ఆ సమయంలో ఆర్థికంగా బలంగా లేకపోవడం వల్లే పోటీకి దూరంగా ఉన్నానని తెలిపారు. తిరుపతిలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాస్, హరిప్రసాద్‌తో తనకు విభేదాలు ఉన్నాయనే ప్రచారాన్ని ఆయన ఖండించారు. తామంతా పవన్ నాయకత్వంలో
జనసేన పార్టీ బలోపేతం కోసమే పనిచేస్తున్నామని స్పష్టం చేశారు. 2024 ఎన్నికల్లో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమిగా పోటీ చేశాయి. జనసేన పోటీ చేసిన 21 అసెంబ్లీ, 2 లోక్‌సభ స్థానాల్లోనూ 100 శాతం స్ట్రైక్ రేట్‌తో చారిత్రక విజయం సాధించింది. ప్రస్తుతం పవన్ కల్యాణ్ ఉప ముఖ్యమంత్రిగా, నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేశ్ మంత్రులుగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

# ఇరాన్ కొత్త సుప్రీం లీడర్‌గా మట్నజ్తబా ఖమేనీ..

- మొదటి పేజి తరువాయి
కుమారుడు మట్నజ్తబా ఖమేనీ(56) బాధ్యతలు చేపట్టనున్నట్లు వార్తలు వస్తున్నాయి. అమెరికా-ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో అలీ ఖమేనీ మరణించటంతో 'అసెంబ్లీ ఆఫ్ ఎక్స్‌పర్ట్స్' మట్నజ్తబాను ఎంపిక చేసినట్లు కొత్త అధినేతగా.మట్నజ్తబా ఖమేనీ కేవలం రాజకీయ వారసుడిగానే కాకుండా.. భారీ స్థాయిలో ఆర్థిక సామ్రాజ్యాన్ని కూడా నడుపుతున్నట్లు తెలుస్తోంది. ఆయన అధికారికంగా ఎటువంటి ప్రభుత్వ పదవిలో లేనప్పటికీ.. తెరవెనుక వేల కోట్ల రూపాయల పెట్టుబడులను కలిగి ఉన్నట్లు తెలుస్తోంది. మట్నజ్తబాకు ప్రపంచవ్యాప్తంగా భారీ రియల్ ఎస్టేట్ సామ్రాజ్యం ఉంది. ముఖ్యంగా పాశ్చాత్య దేశాల మార్కెట్లలో బిలియన్ల కొద్దీ డాలర్లను ఆయన మళ్లించినట్లు ఆరోపణలు ఉన్నాయి. అలాగే బ్రిటన్‌లో మట్నజ్తబాకు అత్యంత ఖరీదైన విలాసవంతమైన భవనం ఉందని, దీని విలువ సుమారు సుమారు రూ.1,150 కోట్లకు పైమాటేనని సమాచారం.అలాగే స్విట్జర్లాండ్ బ్యాంకుల్లో ఆయనకు భారీగా రహస్య ఖాతాలు ఉన్నట్లు అంతర్జాతీయ దర్యాప్తు సంస్థలు అనుమానిస్తున్నాయి. ఇరాన్ నిధులను అక్రమంగా విదేశాలకు తరలించారనే ఆరోపణలతో 2019లో అమెరికా ఆయనపై ఆంక్షలు కూడా విధించిన సంగతి తెలిసిందే. ఇరాన్ రెవల్యూషనరీ గార్డ్స్ (×=+జ)తో మట్నజ్తబాకు ఉన్న సన్నిహిత సంబంధాలు ఆయన ఆర్థిక బలాన్ని మరింత పెంచాయి. ఇరాన్‌లోని కీలక పరిశ్రమలు, క్రూడ్ ఆయిల్ బిజినెస్, విదేశీ పెట్టుబడులపై ఆయనకు పట్టు ఉందని నిపుణులు చెబుతున్నారు. ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ వంటి సంస్థలు మట్నజ్తబా పెట్టుబడులను తీవ్రంగా విమర్శిస్తున్నాయి. అణచివేత ధోరణి ఉన్న పాలకుల అనుచరులు తమ దేశాల్లోని ప్రాపర్టీ మార్కెట్‌ను 'సేఫ్ డిపాజిట్ బాక్స్'గా వాడుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.ఇరాన్ సంప్రదాయం ప్రకారం తండ్రి తర్వాత కుమారుడు సుప్రీం లీడర్ కావడం అనేది కొంత వ్యతిరేకతకు దారితీసే అవకాశం ఉన్నప్పటికీ.. ప్రస్తుత క్లిష్ట పరిస్థితుల్లో ×=+జ సపోర్ట్ తో ఆయన అధికారం చేపడుతున్నట్లు కనిపిస్తోంది. మట్నజ్తబా భార్య జహ్రా హద్దాద్-అడెల్ కూడా ఇటీవలి దాడుల్లో మరణించారు. ఈ అనిశ్చితి మధ్య మట్నజ్తబా ఖమేనీ ఆస్తులు, ఆయన ఆర్థిక మూలాల గురించి ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి.

# రెండు కీలక బిల్లులకు ఆమోదం తెలిపిన ఏపీ శాసనమండలి

ఆంధ్రప్రదేశ్ శాసనమండలి రెండు కీలకమైన బిల్లులకు ఆమోదం తెలిపింది. అసైన్డ్ భూముల చట్ట సవరణ బిల్లు, ఏపీ గ్రామ, వార్డు సచివాలయాల పునర్వ్యవస్థీకరణ బిల్లులను మండలి ఆమోదించింది.

**అసైన్డ్ భూముల సవరణ బిల్లు - 2026**

మంత్రి అనగాని సత్యప్రసాద్ సభలో వివరించిన ప్రకారం, ఈ సవరణ ద్వారా ప్రభుత్వం కేటాయించిన అసైన్డ్ భూములను క్లీన్ ఎనర్జీ ప్రాజెక్టులకు (సౌర, పవన విద్యుత్ వంటివి) లీజుకు ఇచ్చే అవకాశం లభిస్తుంది. బంజరు లేదా చౌడు భూములుగా ఉండి సాగుకు పనికిరాని అసైన్డ్ భూములకు ఈ లీజు ద్వారా భరోసా లభిస్తుంది. ఎకరాకు ఏడాదికి రూ. 31 వేల లీజు ఇవ్వాలని నిర్ణయించారు. ప్రతి రెండేళ్లకు లీజు మొత్తాన్ని 5 శాతం మేర పెంచుతూ చట్టంలో సవరణ చేశారు.అసైనీదారుల పూర్తి అనుమతితోనే భూములు తీసుకుంటారు. ట్రై-పార్టీ అగ్రిమెంట్ (త్రిపక్ష ఒప్పందం) ద్వారా లబ్ధిదారులకు పూర్తి రక్షణ కల్పిస్తారు. ఈ చట్టంతో రాష్ట్రంలో సుమారు రూ. 10 లక్షల కోట్ల విలువైన క్లీన్ ఎనర్జీ ప్రాజెక్టులు వచ్చే అవకాశం ఉంది. దీనివల్ల 7.5 లక్షల మందికి ఉపాధి లభిస్తుందని అంచనా.

**గ్రామ, వార్డు సచివాలయాల సవరణ బిల్లు - 2026**

గ్రామ వార్డు స్థాయి పాలనలో మార్పులు తీసుకువస్తూ ఈ బిల్లును ఆమోదించారు. ప్రస్తుతం ఉన్న గ్రామ, వార్డు సచివాలయాలను ఇకపై 'స్వర్ణ గ్రామం' మరియు 'స్వర్ణ వార్డు' సచివాలయాలుగా పిలుస్తారు.

గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపిస్తూ, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించడమే ఈ మార్పు వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశ్యం.

# చిత్తూరు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

- మొదటి పేజి తరువాయి
దర్యాప్తులో తేలింది. డ్రైవర్ నియంత్రణ కోల్పోవడం వల్లే ఈ ఘోరం జరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు. ప్రస్తుతం మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. మృతుల పూర్తి వివరాల కోసం కర్ణాటక పోలీసులతో కూడా సంప్రదింపులు జరుపుతున్నారు.

# హైదరాబాద్ లో భారీగా కల్తీ నెయ్యి స్వాధీనం

- మొదటి పేజి తరువాయి
కాకుండా జరుగుతున్న ఈ వ్యవహారంపై అధికారులు మెరుపు దాడులు నిర్వహించారు.
ఈ దాడుల్లో పోలీసులు సుమారు 460 కిలోల కల్తీ నెయ్యిని స్వాధీనం చేసుకున్నారు. దీని మార్కెట్ విలువ సుమారు రూ. 18.26 లక్షల వరకు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. ప్రముఖ బ్రాండ్ల పేర్లతో ఉన్న నకిలీ ప్యాకెట్లు, సీళ్లు, ప్యాకేజింగ్ యంత్రాలను పోలీసులు సీజ్ చేశారు. వినియోగదారులను మోసం చేసేలా ఈ ప్యాకేజింగ్ చేస్తున్నట్లు గుర్తించారు. తక్కువ ధరకు వచ్చే నూనెలు, రసాయనాలు కలిపి ఈ నెయ్యిని తయారు చేస్తున్నట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలింది. స్వాధీనం చేసుకున్న నెయ్యి నమూనాలను ల్యాబ్ పరీక్షల కోసం పంపిన అధికారులు, నిందితులపై కేసులు నమోదు చేసి దర్యాప్తు ముమ్మరం చేశారు.

# టెహ్రాన్ సమీపంలో భూగర్భ స్థావరంలో అణుప్రాజెక్టును ధ్వంసం చేశాం

- మొదటి పేజి తరువాయి
అయినప్పటికీ ఆ దేశం అణు కార్యకలాపాలను ఆపలేదని అన్నారు. అణ్వాయుధాలను టెహ్రాన్ శివార్లలోని రహస్య భూగర్భ స్థావరంలో భద్రపరిచిందని, దీనికి సంబంధించి తమకు కచ్చితమైన సమాచారం రావడంతో ఆ ప్రాంతాన్ని లక్ష్యంగా చేసుకున్నామని డెఫ్రిన్ వెల్లడించారు.

## మమ్మల్ని యుద్ధంలోకి లాగొద్దు

మధ్యప్రాచ్యంలో ముదురుతున్న యుద్ధ సెగలు ఇప్పుడు అంతర్జాతీయ దౌత్య యుద్ధానికి దారితీస్తున్నాయి. మరో యుద్ధంలోకి తమ దేశాన్ని లాగవద్దని, శాంతిని కోరుకుంటున్నందుకు తమపై ఆంక్షలు విధించడం సరికాదని స్పెయిన్ ప్రధాని పెడ్రో సాంచెజ్ స్పష్టం చేశారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పెయిన్‌తో వాణిజ్య సంబంధాలను తెంచుకుంటామని హెచ్చరించిన నేపథ్యంలో, సాంచెజ్ ఈరోజు జాతిని ఉద్దేశించి ప్రసంగిస్తూ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు.ఇరాన్‌పై యుద్ధం ప్రకటిస్తున్న వారి లక్ష్యాల్లో స్పష్టత లేదని, స్పెయిన్ ఎన్నడూ ఇలాంటి రక్తపాతాన్ని కోరుకోలేదని ఆయన పేర్కొన్నారు. అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్ దేశాలు యుద్ధాన్ని ఆపాలని పలు దేశాలు చేసిన తీర్మానాల తర్వాతే తాము ఈ డిమాండ్ చేస్తున్నామని గుర్తుచేశారు. ఒక దేశం చేసే చట్టవిరుద్ధమైన చర్యలకు మరో దేశం అదే స్థాయిలో స్పందించడం వల్ల మానవాళికి భారీ విపత్తులు తప్పవని ఆయన హెచ్చరించారు.

# శ్రీలంక తీరంలో ఇరాన్ యుద్ధనౌకపై దాడి...? 101 మంది గల్లంతు...?

శ్రీలంక సముద్ర జలాల్లో బుధవారం ఉదయం కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇరాన్ కు చెందిన 'ఐరిస్ డెనా' (×=×ూ ణవఖు) అనే యుద్ధనౌక (ఫ్రిగేట్) గాలే తీరానికి సమీపంలో మునిగిపోయింది. ఈ ప్రమాద సమయంలో శ్రీలంక నావికాదళం వేగంగా స్పందించి సుమారు 30 మంది సిబ్బందిని ప్రాణాలతో రక్షించింది. ఈ విషయాన్ని శ్రీలంక విదేశాంగ మంత్రి విజిత హెరత్ పార్లమెంట్‌లో అధికారికంగా ప్రకటించారు.బుధవారం తెల్లవారుజామున సుమారు 6 గంటల సమయంలో ఈ నౌక నుంచి ప్రమాద సంకేతాలు (ణఱర్‌తీవం ఝశ్రీశ్రీ) అందాయని శ్రీలంక రక్షణ శాఖ తెలిపింది. వెంటనే అప్రమత్తమైన నావికాదళం రెండు నౌకలు, ఒక విమానాన్ని ఘటనా స్థలానికి పంపి సహాయక చర్యలు చేపట్టింది. రక్షించిన వారిలో గాయపడిన వారిని గాలేలోని నేషనల్ ఆసుపత్రికి తరలించారు. కాగా, రక్షించిన వారిలో ఒకరు మరణించగా, మరొకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఈ నౌకలో మొత్తం 180 మంది సిబ్బంది ఉన్నట్లు తెలుస్తోంది.అయితే, ప్రాణనష్టం విషయంలో భిన్న కథనాలు వినిపిస్తున్నాయి. సముద్ర గర్భం నుంచి జరిగిన దాడి (సబ్‌మెరైన్ అటాక్) వల్లే నౌక మునిగిపోయిందని, దాదాపు 101 మంది ఆచూకీ గల్లంతైందని రాయిటర్స్ వార్తా సంస్థ పేర్కొంది. కానీ, శ్రీలంక నావికాదళ ప్రతినిధి మాత్రం భారీ సంఖ్యలో సిబ్బంది గల్లంతయ్యారన్న వార్తలను ఖండించారు. ప్రస్తుతం 32 మందిని రక్షించామని, మిగిలిన వివరాలు ఇప్పుడే చెప్పలేమని స్పష్టం చేశారు. ఈ దాడికి ఎవరు కారణమనే విషయంపై ఇంకా స్పష్టత రాలేదు. యుద్ధం జరుగుతున్న వేళ ఈ ఘటన చోటుచేసుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది.

పెన్ పవర్
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం । మన్యం । విజయనగరం । విశాఖపట్నం । అనకాపల్లి । అల్లూరి జిల్లా

# వైయస్ జగన్మోహన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన కుందేరి రామకృష్ణ



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, మార్చి 4:**అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులో నిర్వహించిన అరకు ఎమ్మెల్యే రేగం మత్స్య లింగం కుమారుని వివాహ వేడుకకు మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. వివాహ కార్యక్రమం ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరిగింది.ఈ సందర్భంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వేడుకలో భాగంగా గూడెం కొత్తవీధి మండలం దామనాపల్లి పంచాయతీ సర్పంచ్ కుందేరి రామకృష్ణ మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.తన పుట్టినరోజు సందర్భంగా రాజకీయంగా తమపై ఎల్లప్పుడూ ఆశీర్వాదాలు ఉండాలని ఆయన జగన్మోహన్ రెడ్డిని కోరారు. దీనికి సానుకూలంగా స్పందించిన మాజీ ముఖ్యమంత్రి చిరునవ్వుతో ఆశీర్వదించారు. వివాహ వేడుకలో నాయకుల సందడి, కార్యకర్తల ఉత్సాహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

# వైఎస్ షర్మిల రెడ్డి యాత్రను విజయవంతం చేయాలి ..

## జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వంగల దాలినాయుడు.



**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ పార్వతీపురం/ కొమరాడ మార్చి 04 :** భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి యాత్రను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ డిసిసి జిల్లా అధ్యక్షులు వంగల దాలి నాయుడు, పార్వతీపురం నియోజకవర్గం ఇన్చార్జి బత్తిన మోహన్ రావు, జిల్లా కార్యాలయ ఇన్చార్జ్ కోలా కిరణ్ కుమార్, పార్వతీపురం మండల అధ్యక్షులు తీళ్ళ గౌరీ శంకరరావు తదితరులు పార్వతీపురం, కొమరాడ మండలాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా వారు డంగభద్ర, కోనవలస, నందాపురం, తమ్మన్నదొర వలస, పెద్దమరికి, చినమరికి కాలనీ తదితర గ్రామాల్లో పర్యటించి త్వరలో జిల్లాలో తమ పార్టీ అధ్యక్షురాలు వైయస్ షర్మిల రెడ్డి బచావో సంగ్రామ్ యాత్ర కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. ఈనెల 17న ఆమె జిల్లాకు రానున్నట్లు తెలిపారు. ఆ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయా గ్రామాల ప్రజలకు పిలుపునిచ్చారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని బిజెపి ప్రభుత్వం తొలగించిందన్నారు. దీంతో పేదలు ఇబ్బందులు పడే అవకాశం ఉందన్నారు. పేదల కోసం నిత్యం పోరాటం చేసే కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఉపాధి హామీ చట్టాన్ని రక్షించేందుకు రాష్ట్రంలో ఎంజి నరేగా బచావో సంగ్రామ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. కాబట్టి ప్రతి ఒక్కరు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేసి ఉపాధి హామీ చట్టాన్ని రక్షించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామానికి చెందిన ప్రజలు పాల్గొన్నారు.

# డోకులురులో లెట్ రైట్ తవ్వకాలపై కాలుష్య నియంత్రణ మండలి ప్రజాభిప్రాయ సేకరణ ప్రశాంతం





**తవ్వకాల అనుమతులు రద్దు చెయ్యాలని అధిక శాతం గిరిజనులు, సంఘాల నాయకుల అభిప్రాయం**

**ప్రతీ ఒక్కరి అభిప్రాయం ప్రభుత్వానికి నివేదిస్తామన్న ఐటిడిఏ పీఓ తిరుమణి శ్రీపూజ**

**గూడెంకొత్తవీధి,పెన్ పవర్, మార్చి 4:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి మండలం డోకులూరు గ్రామంలో ఎర్రమట్టి (లేట్ రైట్) క్వారీ నిర్వహణకు సంబంధించి కాలుష్య నియంత్రణ మండలి చేపట్టిన ప్రజాభిప్రాయ సేకరణ ప్రశాంతంగా జరిగింది. డోకులురులో బుధవారం కాలుష్య నియంత్రణ మండలి విజయనగరం ప్రాంతీయ అధికారి రాజేంద్రప్రసాద్, పాడేరు ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారిని తిరుమణి పూజశ్రీ ఆధ్వర్యంలో బుధవారం ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అధిక శాతం మంది గిరిజనులు, వివిధ గిరిజన సంఘాలకు చెందిన నాయకులు,పలు రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు లెట రైట్ తవ్వకాల వల్ల తమ ప్రాంతం నాశనం అవుతుందని, కాలుష్యం పెరిగి పర్యావరణం దెబ్బతింటుందని, ముఖ్యంగా రోగాల పాలవుతామని తెలిపారు.తమకు జీవనాధారంగా ఉన్న అడవులు, భూములను మైనింగ్ పేరుతో కొల్లగొట్టడం వల్ల తీవ్రంగా నష్టపోతామని పేర్కొన్నారు. గిరిజనులు నాయకులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. లెట్ రైట్ తవ్వకాల అనుమతులు రద్దు చేయాలని, మా భూములు అడవులను కాపాడాలని నినాదాలు చేశారు.మరికొంత మంది గిరిజనులు తవ్వకాలకు ఎలాంటి అభ్యంతరం లేదని అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా భారత్ ఆదివాసి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మొట్టడం రాజబాబు మాట్లాడుతూ గనుల తవ్వకాలకు అధిక శాతం మంది గిరిజనులు వ్యతిరేకత చూపుతున్నారని తెలిపారు. గనుల తవ్వకాల వల్ల జరిగే అనర్థాలు తెలియక 20 శాతం మంది అనుకూలంగా అభిప్రాయాలు చెప్పారని పేర్కొన్నారు. అధిక శాతం మంది తెలియజేసిన వ్యతిరేకతను గ్రామసభ నిర్వహించిన అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని డిమాండ్ చేశారు. గ్రామసభ వ్యతిరేకంగా అనుమతులు జారీ అయితే పోరాటం చేస్తామని పేర్కొన్నారు.

ప్రతి ఒక్కరి అభిప్రాయం ప్రభుత్వానికి తెలియజేస్తాం: ఐటీడీఏ పీఓ తిరుమణి శ్రీపూజ

కాలుష్య నియంత్రణ మండలి నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో తెలియజేసిన ప్రతి అభిప్రాయాన్ని ప్రభుత్వానికి నివేదిస్తామని పాడేరు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారిని తిరుమణి పూజ శ్రీ తెలిపారు. డొకులూరు గ్రామసభలో ఆమె గిరిజనుల అభిప్రాయాలను తెలుసుకున్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ముందుగా కార్యక్రమాన్ని ప్రశాంతంగా నిర్వహించేందుకు శ్రమించిన పోలీసులకు, రెవెన్యూ అధికారులకు, వివిధ సంఘాల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. డోకులూరు షెడ్యూల్ ప్రాంతంలో ఉందని అయితే ఇక్కడ ఎలాంటి మైనింగ్ జరగాలన్న గ్రామసభ ఆమోదం తప్పక ఉండాలన్నారు. ప్రస్తుతం పర్యావరణ అనుమతులకు సంబంధించి కాలుష్యమండలి నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో గిరిజనులు, ప్రజా సంఘాల నాయకులు, మేధావులు తెలియజేసిన అభిప్రాయాలను ప్రతి ఒక్కటిని నోట్ చేశామని తెలిపారు. గ్రామ సభకు రాలేని, అభిప్రాయాలు చెప్పలేని వారు గురువారం మధ్యాహ్నం లోగా లిఖితపూర్వకంగా తమ అభిప్రాయాలను తెలియజేయవచ్చని పేర్కొన్నారు. ప్రజాభిప్రాయ సేకరణలో వెల్లడైన అభిప్రాయాలను నిష్పక్షపాతంగా నివేదిస్తామని తెలిపారు. ఈ విషయంలో గిరిజనులు నాయకులు ఎలాంటి సందేహాలు అపోహాలు చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. అనంతరం అధికారులకు సిపిఐ సిపిఎం గిరిజన సంఘాల నాయకులు వేరువేరుగా వినతి పత్రాలు అందజేశారు. ప్రజాభిప్రాయ సేకరణ ప్రశాంతంగా జరిగేందుకు జీకేవీధి సర్కిల్ ఇన్స్పెక్టర్ సుధాకర్, ఎస్సై సురేష్ ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో స్థానిక తాసిల్దార్ అన్నాజీరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ, గాలికొండ ఎంపిటిసి బుజ్జిబాబు, గిరిజన సంఘం నాయకులు సత్యనారాయణ,పరమేష్, జనసేన మండల ఉపాధ్యక్షుడు బత్తుల సిద్దార్థ మార్క్ తదితరులు పాల్గొన్నారు.

# కోట సీతారాంపురాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలి

## జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి



**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, పార్వతీపురం. మార్చి 04 :** సీతానగరం మండలంలోని కోట సీతారాంపురం గ్రామాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసి, ఒక సంపూర్ణ ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి అధికారులకు పిలుపునిచ్చారు. ఇందుకోసం ఇప్పటికే ఆదేశాలు జారీ చేశామని, వాటిపై తీసుకున్న చర్యలు వివరించాలని అధికారులను కోరారు. బుధవారం ఆయన ఛాంబరులో నిర్వహించిన ప్రత్యేక సమీక్షా సమావేశంలో కలెక్టర్ వ్యవసాయ, ఉద్యానవన, పశు సంవర్ధక, మత్స్య, సంబంధిత శాఖాధికారులకు ఆయన పలు కీలక సూచనలు చేశారు. రైతులు తక్కువ శ్రమతో అధిక దిగుబడి మరియు రాబడినిచ్చే పంటల వైపు మొగ్గు చూపేలా వ్యవసాయ, ఉద్యానవన అధికారులు ప్రోత్సహించాలన్నారు. భూసార పరీక్షల ఆధారంగా ఏ నేలకు ఏ పంట అనువైనదో శాస్త్రవేత్తలు వివరించాలని, అందుకు తగినట్లుగా చర్యలు చేపట్టాలన్నారు. విత్తనం నాటినప్పటి నుండి విక్రయం వరకు రైతులకు భరోసా కల్పించాలని, ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం దిశగా అడుగులు వేసేలా అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. వ్యవసాయేతర కుటుంబాలకు ప్రాధాన్యతనిస్తూ, వారి ద్వారా కోళ్ల పెంపకం వంటి వాటి ద్వారా ఆదాయ వనరులను పెంచాలని సూచించారు. పరిశ్రమల శాఖ ద్వారా నిరుద్యోగులను గుర్తించి వారికి కొత్త యూనిట్ల స్థాపనలో తోడ్పాటు అందించాలని పేర్కొన్నారు. పాడి పశువులు ఉన్న కుటుంబాలకు కేవలం పాలు అమ్మడమే కాకుండా, పన్నీరు వంటి విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై శిక్షణ ఇచ్చి, అధిక ఆదాయం పొందేలా చూడాలని సూచించారు. గ్రామంలో ఫిష్ ట్యాంకులను ఏర్పాటు చేసి చేపల పెంపకాన్ని ప్రోత్సహించాలని, అలాగే, పారిశుధ్యంలో గ్రామం ప్రథమ స్థానంలో ఉండాలని, దోమల నివారణకు గంబూషియా చేపలను నీటి నిల్వల్లో విడిచిపెట్టాలని ఆదేశించారు. గ్రామంలో ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండాలని, ఇందుకు తగిన విధంగా గ్రామంలో ఆరోగ్య స్థితిగతులను తెలుసుకోవాలన్నారు. శత శాతం టీకాలు వేయడం జరిగిందని డిఎంహెచ్ఓ కలెక్టరుకు వివరించారు. ప్రభుత్వం ఆయా శాఖల ద్వారా అందించే పథకాల వివరాలను అందరికీ అర్థమయ్యేలా వీడియోను చిత్రీకరించి గ్రామంలో ప్రదర్శించాలని, అలాగే పత్రికల్లో, సోషల్ మీడియా ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు.

ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, సబ్ కలెక్టర్ ఆర్.వైశాలి, జిల్లా పంచాయతీ అధికారి టి. కొండలరావు, జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి డా. ఎస్. మన్మధరావు, డ్వామా, డీఆర్డిఏ పీడీలు కె.రామచంద్రరావు, జిల్లా మత్స్య శాఖాధికారి టి.సంతోష్ కుమార్, ఏపీఎంఐపి వి. రాధాకృష్ణ, జిల్లా స్థాయి అధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు మరియు సంబంధిత శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.

# మౌళిక సదుపాయాలు కల్పనే ప్రభుత్వం ధ్యేయం



**గాజువాక పెన్ పవర్, మార్చి 04:**నియోజకవర్గం ఎం ఎల్ ఎ పల్లా శ్రీనివాసరావు ఆదేశాల మేరకు నియోజవర్గ అభివృద్ధిలో భాగంగా, జివియంసి 86 వ వార్డ్ పరిధిలో ఉన్న చెరువులు, పార్కులను సుందరీకరణ కోసం పర్యటనలో భాగంగా, ఎపి స్టేట్ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ మొల్లి పెంటిరాజు వార్డులో ఉన్న రావుల చెరువు, లక్కరాజు పాలెం చెరువు, రాజీవ్ నగర్ పార్కు, మాతృశ్రీ లేఅవుట్ పార్కులను పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజల అవసరాలను గుర్తించి, వారి ఆరోగ్యం కోసం, జీవన ప్రమాణాల మెరుగుకు పార్కులు, చెరువుల అభివృద్ధి ముఖ్యమని, వాటిని సుందరంగా తీర్చిదిద్ది, ప్రజలకు ఆహ్లాదకరమైన జీవనాన్ని అందించేందుకు కృషి చేస్తుందని తెలిపారు. త్వరలోనే వీటిని గ్రీనింగ్ అండ్ బ్యూటీఫికేషన్ డిపార్ట్మెంట్ పరిధిలో అభివృద్ధి పరుస్తామని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు నల్లూరు సూర్యనారాయణ పాల్గొని వార్డులో ఉన్న చెరువులును, పార్కులను అభివృద్ధికి సహకరించాలని కోరారు.



ఈ కార్యక్రమంలో వార్డు క్లస్టర్ ఇంచార్జ్ వేగుంట శ్రీను, రాష్ట్ర టి యన్ టి యు సి నాయకులు కోగంటి లెనిన్, ప్రధానకార్యదర్శి జగదీష్, వైస్ ప్రెసిడెంట్ రమేష్ , గాజువాక తెలుగుయువత అధ్యక్షుడు గణపతి, నాగార్జున, వెంకటేష్, సుబ్బయ్య, బుజ్జమ్మ, గోవింద్, నాయుడు, నక్కా గంగరాజు, సంఘం ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# ఉమ్మడి విశాఖలో పెట్టుబడుల వర్షం: 15 సాఫ్ట్‌వేర్ కంపెనీలు,

★ భారీ స్టీల్ పరిశ్రమ లక్షల ఉద్యోగాల దిశగా అడుగులు

**విశాఖ దక్షిణ, మార్చి 4 (పెన్ పవర్):** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉమ్మడి విశాఖ జిల్లాలో పెట్టుబడులు గణనీయంగా పెరిగాయని విశాఖ దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ తెలిపారు. కొత్త పరిశ్రమలు, ఐటీ సంస్థలు స్థాపనతో ఉత్తరాంధ్ర యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడ్డాయని పేర్కొన్నారు.

గతంలో ఉపాధి కోసం యువత హైదరాబాద్, బెంగళూరు వంటి నగరాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదని ఆయన గుర్తుచేశారు. ప్రస్తుతం విశాఖలో 15 కొత్త సాఫ్ట్‌వేర్ కంపెనీలు ప్రారంభమవుతున్నాయని, వీటి ద్వారా లక్షల సంఖ్యలో ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగావకాశాలు కలుగనున్నాయని వెల్లడించారు.

అలాగే నక్కపల్లిలో భారీ స్టీల్ పరిశ్రమ స్థాపనకు చర్యలు చేపట్టడం ద్వారా స్థానికంగా మరిన్ని ఉపాధి అవకాశాలు సృష్టించబడతాయని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పెట్టుబడిదారుల్లో విశ్వాసం పెరిగిందని, గత ప్రభుత్వ కాలంలో నెలకొన్న అనిశ్చిత పరిస్థితులు తొలగిపోయాయని వ్యాఖ్యానించారు. ప్రస్తుతం ఇన్వెస్టర్లు ఎలాంటి భయాందోళనలు లేకుండా రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నారని చెప్పారు.

ఉపాధి కల్పనపై ప్రత్యేక దృష్టి సారించిన రాష్ట్ర ఐటీ మరియు పరిశ్రమల శాఖ మంత్రి నారా లోకేష్ అనేక సాఫ్ట్‌వేర్ సంస్థలను రాష్ట్రానికి తీసుకురావడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర ప్రాంతంలోనే ఉద్యోగావకాశాలు పెరగడం వల్ల యువత ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన అవసరం తగ్గుతుందని తెలిపారు.

రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ముందుకు నడిపిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరియు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



# మన గ్రామాన్ని పారిశుద్ధ్య రహిత గ్రామంగా. తీర్చిదిద్దుదాం..!

- హుకుంపేట పంచాయతీ సెక్రెటరీ సత్యనారాయణ..





**హుకుంపేట పెన్ పవర్ మార్చి 4 :**అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట మండల కేంద్రంలో గల పంచాయతీ సెక్రెటరీ గ్రామ ప్రజలకు కాలువలను శుభ్రం చేయించాం దాంట్లో చెత్త వేయొద్దని పిలుపునిచ్చారు ప్రతిరోజు ఉదయాన్నే క్లాప్ మిత్రులు చెత్త సేకరణ వాహనాలను తీసుకొని హుకుంపేట మండల కేంద్రం సుభ్రపరుస్తున్నారని ఆయన అన్నారు గ్రామ ప్రజలు వారు ఇళ్లల్లో ఉన్నటువంటి వ్యర్థాలను రెండు రకాలుగా వేరుచేసి ఒకటి తడి చెత్త రెండోది పొడి చెత్తగా వేరువేరుగా క్లాత్ మిత్రులకు అందించవలెనని ఆయన అన్నారు కాలువలో చెత్తయడం వల్ల మురుగునీరు ప్రవాహానికి తీవ్ర అంతరాయం కలుగుతుందని తద్వారా దోమలు పెరిగే అవకాశం ఉందని ప్రజలు అనారోగ్యానికి కారణం అవుతారని ఆయన అన్నారు కాబట్టి గ్రామ ప్రజలందరూ క్లాత్ మిత్రులకు సహకరించాలని మన గ్రామాన్ని శుభ్రంగా ఉంచుకుంటే బాధ్యత మన అందరిదీ అని ఆయన అన్నారు. అలాగే ఎలక్ట్రికల్ వ్యర్థాలను వేరుచేసి క్లాప్ మిత్రులకు అందించాలని తద్వారా పర్యావరణాన్ని. కాపాడుకుందామని ఆయన అన్నారు అంతే కాకుండా కాలువల్లో మురుగును పూడికను ఆయన దగ్గరుండి తొలగించారు క్లాత్ మిత్ర గా పనిచేసేవారు. అనునిత్యం గ్రామ శుభ్రతకు శ్రమిస్తున్నారని వారిని గౌరవించాలని ఈ సందర్భంగా ఆయన అన్నారు.

గ్రామంలో ప్రధాన మురుగు కాలువలను శుభ్రపరుస్తున్నామని దాంట్లో దాంట్లో ఎవరైనా వ్యర్థాలు వేసినట్టు మాకు తెలియజేస్తే వారిపై చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా గ్రామపంచాయతీ సెక్రెటరీ హెచ్చరించారు

## రంజాన్ ఉపవాస దీక్షలో పాల్గొన్న ఎంపీ కలిశెట్టి.



**చీపురుపల్లి పెన్ పవర్ మార్చి 04.** పవిత్ర రంజాన్ ఉపవాస దీక్షల సందర్భంగా విజయనగరం పార్లమెంటు ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు మరియు తెలుగుదేశం రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్ మల్లిక్ నాయుడు గరివిడి లో గల మసీదులో రంజాన్ ఉపవాస దీక్ష ప్రార్థన ముస్లిం సోదరులతో కలిసిలో పాల్గొన్నారు.ది

## మార్చి 6న ఉద్యోగ మేళా

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ శ్రీకాకుళం. మార్చి 04** : నిరుద్యోగ యువతకు ప్రైవేటు రంగంలో ఉపాధి కల్పించేందుకు ఈనెల 6న శ్రీకాకుళంలో భారీ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి కొత్తలంక సుధ ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ప్రభుత్వ హాస్పిటల్ జంక్షన్ సమీపంలోని ప్రభుత్వ ఐటీఐ ప్రాంగణంలో ఉదయం 10 గంటల నుంచి ఈ ఎంపికలు ప్రారంభమవుతాయి. జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో జరిగే ఈ మేలాలో యపిటోరియా (అరబిందో), అన్నపూర్ణ ఫైనాన్స్, డెక్కన్ ఫైన్ కెమికల్స్ వంటి ప్రముఖ సంస్థలు పాల్గొని సుమారు 230 ఖాళీలను భర్తీ చేయనున్నాయి. పదో తరగతి, ఇంటర్, ఏదైనా డిగ్రీతో పాటు బి.ఎస్సీ/ఎమ్మెస్సీ (కెమిస్ట్రీ), డిప్లొమా కెమికల్ పూర్తి చేసిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

ఈ మేళా ద్వారా ఎంపికైన వారికి పోస్టును బట్టి నెలకు రూ.14,500 నుండి రూ.35,000 వరకు వేతనం లభిస్తుందని, శ్రీకాకుళం, విజయనగరం, పరవాడ, పాయకరావుపేట వంటి ప్రాంతాలలో పనిచేయాల్సి ఉంటుందని అధికారులు వెల్లడించారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ బయోడేటా, విద్యా అర్హత ధ్రువపత్రాల నకళు ,, ఆధార్ కార్డుతో నేరుగా హాజరుకావచ్చని సూచించారు. అభ్యర్థులు ముందుగా తమ వివరాలను ఖఖఖ.అఎం.స్త్రశీజ.ఱఅ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు. 18 నుండి 35 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన యువతీ యువకులు ఈ మేళాకు హాజరుకావచ్చని, మరిన్ని వివరాలకు స్థానిక ఉపాధి కార్యాలయంలో సంప్రదించాలని వివరించారు.

## కురుపాం లో ఘనంగా డోలా యాత్ర..

**కురుపాం, పెన్ పవర్, మార్చి 4 :** కురుపాం, శివన్నపేట లో ఘనంగా డోలా యాత్ర నిర్వహించారు. జగన్నాధ స్వామి వారి ఆలయ ప్రాంగణం లో ప్రతీ ఏడాది 3రోజులు యాత్ర ఘనంగా నిర్వహిస్తారు. ఈ యాత్ర లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకుంటారు. కమిటీ వారు సంస్కృతి క కార్యక్రమాలు నిర్వహిస్తారు. యాత్ర లో ఎటువంటి ఘటనలు జరగకుండా కురుపాం ఎస్సై నారాయణరావు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

# పసుపక్ష్యాదులకు నీరు అందుబాటులో ఉంచండి





- 20 వేలు మట్టి పాత్రలు ఏర్పాటు కు కృషి చేస్తున్నాం
- వన్యప్రాణులు వేటగాళ్ల బారిన పడకుండా చర్యలు చేపట్టాలి
- ప్రభుత్వం స్పందించి పశుపక్ష్యాదులకు నీటి వసతి కల్పించాలి
- జెవి రత్నం, వ్యవస్థాపక కార్యదర్శి, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ

**విశాఖ మార్చ్ 4(పెన్ పవర్)**పసుపక్ష్యాదులకు నీరు అందుబాటులో ఉంచండని గ్రీన్ క్లైమేట్ టీం ఎన్ జి ఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం పిలుపునిచ్చారు. బుధవారం ఉదయం విశాఖపట్నం జిల్లా ఎంవిపి కాలనీ లోని ఆళ్వార్ దాస్ డిగ్రీ కళాశాల మైదానంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జగదీష్ అధ్యక్షతన పశుపక్ష్యాదులకు నీరు మట్టి పాత్రలలో ఏర్పాటు చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. ఈ ఏడాది పసుపక్ష్యాదులకు నీరు ఏర్పాటు చేయడానికి 20 వేలు మట్టి పాత్రలు ఏర్పాటునకు కృషి చేస్తున్నాం అన్నారు. దేశం లో ప్రతి ఒక్కరూ స్పందించి పశు పక్ష్యాదులకు నీరు అందుబాటులో ఉంచాలని కోరారు. సమస్త జీవరాశిని కాపాడుకుందామన్నారు.

రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు స్పందించి పశుపక్ష్యాదులకు నీటి వసతి కల్పించాలని కోరారు. విశాఖపట్నం జిల్లా అధికారులు కూడా స్పందించి పశుపక్ష్యాదులకు నీటి వసతి కల్పించాలని కోరారు. పక్షులు కోసం చిరుధాన్యాలు అందుబాటులో ఉంచాలని కోరారు. అడవుల్లో, కొండల మీద, తీర ప్రాంతాలలో వర్షాకాలంలో చిరుధాన్యాలు చల్లి పశుపక్ష్యాదులకు ఆహారం అందుబాటులోకి తీసుకు రావాలని కోరారు. వేసవి కాలంలో నీటి కోసం అడవి నుండి బయటకు వచ్చే వన్యప్రాణుల వేటగాళ్ల బారిన పడకుండా, వేట జరగకుండా చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఈ కార్యక్రమంలో మ్యాంగో మేన్ అప్పాజీ, స్వాంతన సేవా సంస్థ ప్రతినిధి ప్రజ్ఞాన్ కుమార్, గ్రీన్ క్లైమేట్ టీం వాలంటీర్ జె రాజేశ్వరి, పలువురు లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొని మాట్లాడారు.

## వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు పాటిద్దాం డీఎంహెచ్ఓ డా. ఎస్. జీవనరాణి



**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, విజయనగరం. మార్చి 04:**వేసవి కాలం ప్రారంభమైన నేపథ్యంలో ప్రజలందరూ వడదెబ్బ (హీట్ స్ట్రోక్) పై పూర్తి అవగాహన కలిగి జాగ్రత్తలు పాటించాలని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్. జీవనరాణి ఒక ప్రకటనలో తెలిపారు. "వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు పాటిద్దాం వడదెబ్బ వలన సంభవించే మరణాలను అరికడదాం" అనే నినాదంతో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని ఆమె సూచించారు.

ఎండ తీవ్రత కారణంగా శరీర ఉష్ణోగ్రత 104.9 డిగ్రీల ఫారెన్‌హీట్ వరకు పెరిగి మెదడుపై ప్రభావం చూపుతుందని, దీనివల్ల శరీర ఉష్ణోగ్రత నియంత్రించే మెదడు కేంద్రం దెబ్బతిని హీట్ స్ట్రోక్ లేదా సన్ స్ట్రోక్ (వడదెబ్బ) సంభవిస్తుందని తెలిపారు. ఇది అత్యంత ప్రమాదకరమై, ప్రాణాంతకమయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు.

వడదెబ్బ లక్షణాలు:

చెమట పట్టకపోవడం

శరీర ఉష్ణోగ్రత అధికంగా పెరగడం

వణుకు పుట్టడం

మగత నిద్ర, కలవరింతలు

ఫిట్స్ రావడం లేదా అపస్మారక స్థితి

ఎండలో బయటికి వెళ్లినప్పుడు పై లక్షణాలు కనిపించినట్లయితే వెంటనే సమీప వైద్యున్ని సంప్రదించి ప్రథమ చికిత్స పొందాలని సూచించారు.

వడదెబ్బ నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలు:

గొడుగు వాడటం, తెలుపు రంగు లేదా పలుచటి చేనేత వస్త్రాలు ధరించడం

తలకు టోపీ లేదా రుమాలు ధరించడం

వేడి గాలులు తగలకుండా జాగ్రత్తపడడం

ఉదయం 11.00 గంటల నుండి సాయంత్రం 4.00 గంటల వరకు ఆరుబయట అధిక శారీరక శ్రమతో కూడిన పనులు చేయకపోవడం

దూర ప్రయాణాలు చేయాల్సి వచ్చినపుడు ఉదయం 11.00 గంటల లోపు లేదా సాయంత్రం 4.00 గంటల తరువాత చేయడం

ఇంటి నుండి బయటకు వెళ్లే ముందు ఒక గ్లాసు మంచినీరు త్రాగడం

ఎండలో తిరిగేటప్పుడు తాగునీరు వెంట తీసుకువెళ్లడం

ప్రథమ చికిత్స: వడదెబ్బ తగిలిన వ్యక్తిని వెంటనే నీడగల ప్రదేశానికి తీసుకెళ్లి, చల్లని నీటిలో ముంచిన తడి గుడ్డతో శరీరాన్ని తుడవాలని తెలిపారు. శరీర ఉష్ణోగ్రత సాధారణ స్థాయికి వచ్చే వరకు చల్లబరుస్తూ ఉండాలని సూచించారు. చల్లని గాలి తగిలేలా చూడాలని తెలిపారు. డీహైడ్రేషన్ నివారణకు ఉప్పు కలిపిన మజ్జిగ, గ్లూకోజ్ ద్రావణం లేదా ఓఆర్ఎస్ ద్రావణం త్రాగించవచ్చని తెలిపారు.

అపస్మారక స్థితిలో ఉన్న రోగికి నీరు త్రాగించకూడదని, వెంటనే సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. ఎస్. జీవనరాణి సూచించారు.

ప్రజలందరూ అప్రమత్తంగా ఉండి వడదెబ్బ నివారణ చర్యలు పాటించి ఆరోగ్యంగా ఉండాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

## విబి జీరామ్ జీ పై ప్రజల్లో అవగాహన కల్పించాలి

డిప్యూటీ ఎంపీడీవో జి.రమేష్ బాబు




**కురుపాం, పెన్ పవర్, మార్చి 4:** కేంద్ర ప్రభుత్వం ఇటీవల పేరు ,నిబంధనలు మార్పు చేసి అమలు కు శ్రీ కారం చుట్టిన విబీ జీ రామ్ జీ (జాతీయ గ్రామీణ ఉపాధి పథకం) పై ప్రజలకు అవగాహన కల్పించాలని డిప్యూటీ ఎంపీడీవో జి.రమేష్ బాబు సూచించారు. ఎపీఓ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వికసిత్ భారత్ జీ రామ్ జీ (ఎఱఎంట్ దీష్ఘుతీఫ్ – + =ూవీ +)ప్రధాన అంశాలపై అవగాహన కల్పించారు. 125 రోజుల హామీ కలిగిన వేతన ఉపాధి ,గ్రామ సభ ద్వారా వికసిత్ గ్రామ పంచాయతీ ప్రణాళిక (ఎ+ఱా),, నిరుద్యోగ భత్యానికి బలమైన నిబంధనలు విజిపిపి లో అన్ని పథకాల సమన్వయం, (జశీఅజవతీస్త్రవఅచెవ), సమయానికి వేతన చెల్లింపు మరియు ఆలస్యానికి పరిహారం , సాంకేతికత ద్వారా సాధికారత (జుఎజూశీషవతీఎవత్) ముఖ్య ఉద్దేశ్యం అని తెలిపారు. ప్రజలలో నెలకొన్న అపోహలు తొలఖిపయో విధంగా గ్రామ స్థాయి నుండి అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు..ఇంజనీరింగ్ అసిస్టెంట్ మూర్తి ,సాంకేతిక సహాయకులు ,క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యుల మన్యం జిల్లా పర్యటన



**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, పార్వతీపుర. మార్చి 04:** రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యులు రావాడ సీతారాం ఈ నెల 6వ తేదీ నుండి మన్యం జిల్లాలో పర్యటించనున్నారు. ఈ పర్యటనకు సంబంధించిన వివరాలు మార్చి 6వ తేదీ వీరఘట్టం, పాలకొండ ప్రాంతాల్లో పర్యటన, మార్చి 7వ తేదీ ఉదయం నుండి జిల్లాలోని వివిధ ప్రాంతాలను సందర్శించి, రాత్రికి పార్వతీపురంలోనే బస చేస్తారు. మార్చి 8వ తేదీ పార్వతీపురం నుండి బయలుదేరి పాలకొండ, వీరఘట్టం లోకల్ ప్రాంతాలను తనిఖీ చేసిన అనంతరం విశాఖపట్నం చేరుకుంటారు.

## గ్రామీణ యువతీ యువకులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ ఇచ్చి ఉద్యోగ కల్పన


సెంటర్ మేనేజర్ పి. రవి

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, శ్రీకాకుళం. మార్చి 04**: గ్రామీణ యువతీ యువకులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ కొరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు దీన్ దయాల్ గ్రామీణ కౌసల్య యోజన కేంద్ర మేనేజర్ పి. రవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీన్ దయాల్ ఉద్యోగ కౌసల్య యోజన, స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమం కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్న ఉచిత కంప్యూటర్ శిక్షణ నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రవేశానికి కావలసిన వయస్సు: 18–35 సంవత్సరాలు కలిగి, పదవ తరగతి మార్కుల జాబితా, ఆధార్ కార్డ్, రేషన్ కార్డ్, కుల ధృవీకరణ, బ్యాంక్ పాస్ బుక్ & 4 పాస్‌పోర్ట్ ఫోటోలు ఉండాలన్నారు. 90 రోజులు ఇచ్చే శిక్షణలో స్పోకెన్ ఇంగ్లీష్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్, కస్టమర్ కేర్, రిటైల్ సేల్స్ ఎక్సెక్యూటివ్, కంప్యూటర్ బేసిక్స్ నేర్పబడునని వివరించారు. స్టడీ మెటీరియల్, యూనిఫారమ్ ఉచితంగా అందించబడునని, శిక్షణ కాలంలో ఉచిత హాస్టల్, భోజన సదుపాయం కల్పించబడునన్నారు.

శిక్షణ అనంతరం సర్టిఫికెట్‌తో పాటు ఉద్యోగం కల్పించబడునని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ఉచిత శిక్షణ కొరకు దరఖాస్తులు కోరబడుచున్నవి. దరఖాస్తు చేయుటకు మార్చి 15వ తేదీ ఆఖరని తెలిపారు. సంప్రదించవలసిన చిరునామా హీూ=+ స్కిల్ డెవలప్మెంట్ సెంటర్, శ్రీ విశ్వ విజేత జూనియర్ కాలేజ్ బిల్డింగ్స్, శ్రీ చైతన్య స్కూల్ వెనుక, మహాలక్ష్మి నగర్ కాలనీ, శ్రీకాకుళం. సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు 8341693700, 7842084099.

## ఈనెల 6 నుండి 8వరకు రేవళ్ల శాంతి దుర్గమ్మ 17వ వార్షికోత్సవాలు...

**కొయ్యూరు,పెన్ పవర్ మార్చి 4:** ఈనెల 6 నుండి 8 వరకు మండలంలోని రేవళ్ల పంచాయితీ, రేవళ్ల గ్రామంలో వేంచేసియున్న శ్రీశ్రీశ్రీ శాంతి దుర్గమ్మ ఆలయ 17వ వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఉత్సవ కమిటీ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా 6న పూజలు ప్రారంభమై, 7న ప్రత్యేక అభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించనున్నట్టు, రాత్రి 8 గంటలకు సాంఘిక నాటకం నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే 8 మధ్యాహ్నాం ఆలయ ప్రాంగణంలో భారీ అన్నసంతర్పణ నిర్వహించనున్నట్టు గ్రామ పెద్దలు మాజీ సర్పంచ్ కొండపల్లి దేవుడు, సర్పంచ్ జనుమూరి వెంకటలక్ష్మి, గ్రామదేవత పూజారి అద్దేపల్లి నూకరాజు, బూరుగు లవ కుశ, సాగరి వెంకటేశ్వర్లు, మరువాడ రాంబాబు, అద్దేపల్లి కొండబాబు, మరువాడ కుశల, లువ్వా వెంకటేశ్వర్లు, కవిలి సూరిబాబు, వమ్మపల్లి గణేష్, మొండూరి సత్యనారాయణ, జి. రవికుమార్ తెలిపారు.




# గిరిజనులపై అటవీశాఖ దౌర్జన్యం ఆపాలి

- కొండచీపురుల రవాణాలో రూ.10,000 అక్రమ వసూళ్ల
- గిరిజనుల జీవనాధారంపై అటవీశాఖ అధికారుల దాడి
- సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగు నాయుడు

**కురుపాం, పెన్ పవర్, మార్చి 4:** గిరిజనులు కష్టపడి సాగు చేసిన అటవీ ఉత్పత్తుల రవాణాలో అటవీశాఖ అధికారులు అన్యాయంగా అడ్డంకులు సృష్టిస్తూ లంచాలు వసూలు చేస్తున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగు నాయుడు తీవ్రంగా ఆరోపించారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడుతూ అటవీ శాఖ అధికారులు అధికార దుర్వినియోగంతో గిరిజనుల జీవనాధారంపై దెబ్బ కొడుతున్నారని మండిపడ్డారు. మండలంలో వబ్బంగి పంచాయతీలో గల తోలుంగూడ గ్రామానికి చెందిన మండంగి రవి, మండంగి సంతోష తమ కొండలో సాగు చేసిన కొండచీపురులను విక్రయించేందుకు సీతంపేట, కొత్తూరు తరలిస్తుండగా చినబగ్గ కాలనీ జంక్షన్ వద్ద బుధవారం ఉదయం అటవీశాఖ అధికారులు వాహనాన్ని అడ్డగించి రూ.10,000 వసూలు చేసిన ఘటన దీనికి ఉదాహరణ అని పేర్కొన్నారు. గిరిజనులు పండించిన పంటను అమ్ముకునే హక్కును కూడా అధికారులే దోచుకుంటున్న పరిస్థితి నెలకొన్నదని అన్నారు.

ఈ ఘటనను సిపిఎం పార్టీ తీవ్రంగా ఖండిస్తున్నదని, సంబంధిత అధికారులపై తక్షణ శాఖాపరమైన చర్యలు తీసుకుని వసూలు చేసిన డబ్బును తిరిగి చెల్లించాలని డిమాండ్ చేశారు. అటవీశాఖ పేరుతో గిరిజనులను బెదిరించడం, అక్రమ వసూళ్లకు పాల్పడడం సహించబోమన్నారు.ఐటీడీఏ పరిధిలో గిరిజనులు సాగు చేస్తున్న అటవీ ఉత్పత్తులన్నింటినీ గిరిజన సహకార సంస్థ ద్వారా (జిసిసి) ద్వారా ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేసి గిరిజనులకు సరైన ధర కల్పించాలని కోరారు. అధికారుల అవినీతి, మధ్యవర్తుల దోపిడీ వల్ల గిరిజన రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.అటవీశాఖ అధికారుల అక్రమ చర్యలు కొనసాగితే గిరిజన రైతులను పెద్దఎత్తున కదిలించి కార్యాలయాల ముట్టడులు, ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. గిరిజనుల హక్కుల పరిరక్షణ కోసం పోరాటం మరింత ఉద్ధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కోరంగి సీతారాం తదితరులు పాల్గొన్నారు.









## గంగిరి గణేష్ తల్లికి పరిహారం..

- రూ.10 లక్షల చెక్కును తల్లికి అందజేసిన జెన్కో అధికారులు



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, మార్చి 4:** ఏపీ జెన్ కో సీలేరు జల విద్యుత్ కేంద్రం స్విచ్ యార్డ్ లో గత నెల 12న ప్రమాదవశాత్తు మృతి చెందిన గంగిరి.గణేష్ కుటుంబానికి జెన్కో అధికారులు అండగా నిలిచారు.మృతి చెందిన వెంటనే పది లక్షల రూపాయలు పరిహారం చెల్లిస్తామని అని జెన్కో ఎండి పుల్లారెడ్డి. డైరెక్టర్ సుజయ్ కుమార్ బాధిత కుటుంబానికి సహాయం చేద్దాము అని స్థానిక అధికారులకు భరోసా కల్పించారు.దీంతో వారి ఆదేశాలతో స్థానిక అధికారులు చొరవ నెలరోజులు గడవకముందే ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ కె.వి రాజారావు చెక్కు వచ్చేలా కృషి చేశారు.బాధిత కుటుంబానికి 10 లక్షల చెక్కు బుధవారం మృతిడు తల్లికి అందజేశారు.కుటుంబానికి జెన్కో అండగా ఉంటుందని కుటుంబంలో ఒకరికి ఉద్యోగం త్వరగా వచ్చేలా చర్యలు తీసుకుంటామని జల విద్యుత్ కేంద్రం ఈఈ రాజేంద్రప్రసాద్ తల్లికి భరోసా ఇచ్చారు.ఈ చెక్కు ఆమెకు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఏడిలు శ్రీధర్.సురేష్.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## డౌనూరు లో శ్రీ శ్రీ శ్రీ తలుపులమ్మ తల్లి విగ్రహా ప్రతిష్ట...!

- విచ్చేసిన పాడేరు టిడిపి ఇన్చార్జ్ గిడ్డి ఈశ్వరి



**కొయ్యూరు, పెన్ పవర్ మార్చి 4:** మండలంలోని దౌనూరు పంచాయితీ ధర్మవరంలో శ్రీ శ్రీ శ్రీ తలుపులమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట గిడ్డి ఈశ్వరి చేతిలో మీదుగా జరిగింది. బుధవారం ధర్మవరం గ్రామంలో విగ్రహ ప్రతిష్ట లో పాల్గొన్న గిడ్డి ఈశ్వరి పాల్గొనడంతో గ్రామస్తులందరూ హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మహిళా అధ్యక్షురాలు బోనంగి సత్యవతి, గ్రామ టిడిపి అధ్యక్షురాలు తోకల దేవి, వైస్ ప్రెసిడెంట్ రాజబాబు, ఎక్స్ సర్పంచ్ దేవుడమ్మ, గ్రామ పెద్దలు అప్పారావు, కళ్యాణం, జగన్,బూత్ కమిటీ కన్వీనర్ భీమరాజు పలువురు టిడిపి నేతలు తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల విద్యార్థినిలకు స్వీయ రక్షణ పై అవగాహన కార్యక్రమం.....

నర్సీపట్నం రూరల్ సీఐ ఎల్.రేవతమ్మ......



**నాతవరం, పెన్ పవర్ (మార్చి 04):** పాఠశాల విద్యార్థినిలకు స్వీయ రక్షణ పై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని నర్సీపట్నం రూరల్ సీఐ రేవతమ్మ అన్నారు.అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల సందర్భంగా స్థానిక ఎస్సై వై,తారకేశ్వరరావు,శక్తి టీమ్ ఆధ్వర్యంలో బుధవారం నాతవరం మండలం డి.ఎర్రవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న బాలికలకు స్వీయ రక్షణ అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా సీఐ రేవతమ్మ మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థినులకు ప్రాథమిక స్వీయ రక్షణ పద్ధతులపై అవగాహన,మహిళల భద్రతపై చైతన్యం కలిగించడమే లక్ష్యంగా తీసుకురావాలని ఆమె అన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఇనుపసప్పల సత్య, ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులు విద్యార్థినిలు పాల్గొన్నారు

## సెల్ఫ్ డిఫెన్స్ పై కేజీబివిలో పోలీస్ అవగాహన...!

**కొయ్యూరు, పెన్ పవర్ మార్చి 4:**
అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం కొయ్యూరు సీఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కొయ్యూరు పోలీస్ స్టేషన్ తరపున రాజేంద్రపాలెం కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో బాలికలకు సెల్ఫ్ డిఫెన్స్( ఆత్మరక్షణ)పై అవగాహన మరియు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో కొయ్యూరు ఎస్సై కిషోర్ వర్మ ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా పీడీ లోతా ప్రసాద్ బాలికలకు వ్యక్తిగత భద్రత, స్వీయ రక్షణ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ప్రమాద పరిస్థితుల్లో ఎలా స్పందించాలి, ధైర్యంగా "నో " చెప్పడం, సహాయం కోసం ఎలా స్పందించాలి? వంటి అంశాలపై వివరించారు.

అదేవిధంగా ప్రాథమిక సెల్ఫ్ డిఫెన్స్ టెక్నిక్స్‌ను ప్రదర్శించి, బాలికలకు ప్రాక్టికల్ శిక్షణ అందించారు. ఈ శిక్షణ ద్వారా బాలికల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించడం మరియు వారి భద్రతపై అవగాహన కల్పించడం ప్రధాన ఉద్దేశ్యంగా కార్యక్రమం నిర్వహించబడిందన్నారు.మహిళల భద్రతపై పోలీసులు ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటారని, ఏవైనా ఇబ్బందులు ఎదురైతే వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు.



ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మరియు విద్యార్థినిలు పాల్గొన్నారు.

## ఈ నెల 11వ తేదీన మండల సర్వసభ్య సమావేశం.....



ఎంపీడీవో ఎం.సత్య శ్రీనివాస్...

**నాతవరం పెన్ పవర్ (మార్చి 04):** మార్చి 11వ తేదీ బుధవారం ఉదయం 10 గంటలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వ సభ్య సమావేశం నిర్వహిస్తున్నామని బుధవారం నాతవరం ఎంపీడీవో ఎం.సత్య శ్రీనివాసు తెలిపారు.ఈ సమావేశానికి ఎంపీపీ సాగిన లక్ష్మణ మూర్తి అధ్యక్షత వహిస్తారని అన్నారు.మండల ప్రజా ప్రతినిధులు,ఎంపీటీసీలు,సర్పంచులు మండల స్థాయి అధికారులంతా పూర్తి సమాచారంతో హాజరుకావాలని తెలియజేశారు.

## అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా విద్యార్థిని లకు స్వీయ రక్షణ శిక్షణ తరగతులు





**కురుపాం ,పెన్ పవర్,మార్చి 4 :**
అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కురుపాం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (ఖ+దీఎ)లో ప్రత్యేకంగా "సెల్ఫ్ డిఫెన్స్" (స్వీయ రక్షణ) శిక్షణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.కురుపాం ఎస్సై నారాయణరావు ఆధ్వర్యంలో మార్షల్ ఆర్ట్స్ ట్రైనర్స్ తో బాలికలకు తమపై తాము రక్షణ కల్పించుకునే పలు సాంకేతికతలను ప్రదర్శించి వివరించారు. ప్రస్తుత సమాజంలో బాలికలు, మహిళలు ఎదుర్కొనే వివిధ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, ప్రమాద సమయాల్లో ఎలా స్పందించాలి, ఎలా ధైర్యంగా నిలబడాలి, ఎలా అప్రమత్తంగా ఉండాలి వంటి అంశాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా ఎస్సై నారాయణరావు మాట్లాడుతూ మహిళలు భయపడకుండా ధైర్యంగా జీవించేందుకు ఇలాంటి శిక్షణలు ఎంతో అవసరమని తెలిపారు. విద్యతో పాటు స్వీయ రక్షణ నైపుణ్యాలు కూడా బాలికలకు తప్పనిసరిగా ఉండాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో పోలీస్ హెల్ప్‌లైన్ నంబర్లను వినియోగించుకోవాలని సూచించారు.

## గ్రామ అవసరాలకు గ్రామ కంఠం భూమిని కాపాడాలి

ఏబులం గ్రామస్తుల తీర్మానం తహసీల్దార్‌కు వినతి

**గూడెం కొత్తవీధి,పెన్ పవర్ మార్చి 4:** మండలంలోని రింతాడ పంచాయతీ పరిధిలోని ఏబులం గ్రామంలో ఉన్న గ్రామ కంఠం భూమిని గ్రామ అవసరాలకే వినియోగించాలనే డిమాండ్ వ్యక్తమైంది. ఇళ్ల స్థలాలుగా మార్చకుండా చర్యలు తీసుకోవాలని గిరిజనులు కోరారు.గ్రామస్తులు బుధవారం గూడెం కొత్తవీధి తహసీల్దార్ హెచ్ అన్నాజీరావును కలిసి వినతిపత్రం సమర్పించారు. ఇటీవల గ్రామస్తులకు తెలియకుండా వలసదారులు గ్రామ కంఠం భూమిలో ఇళ్లు నిర్మించేందుకు అనుమతి ఇవ్వాలని కలెక్టర్‌కు అర్జీ పెట్టుకున్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో తహసీల్దార్ గ్రామాన్ని సందర్శించగా, గ్రామస్తులు తమ అభ్యంతరాలను వ్యక్తం చేశారు. రాబోయే తరాల అభివృద్ధి దృష్ట్యా గ్రామంలో పాఠశాలలు, కమ్యూనిటీ భవనాలు తదితర అవసరాల కోసం మాత్రమే గ్రామ కంఠం భూమిని వినియోగిస్తామని, వ్యక్తిగత ఇళ్ల నిర్మాణానికి ఇవ్వబోమని గ్రామసభ ఏర్పాటు చేసి ఏకగ్రీవంగా తీర్మానించారు. ఆ తీర్మాన పత్రాన్ని తహసీల్దార్‌కు అందజేశారు.గ్రామ కంఠం భూమిని పరిరక్షించాల్సిందిగా అధికారులు చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పీసా ఉపాధ్యక్షులు కంకిపాటి రమేష్‌తో పాటు సాగిన వీరన పడాల్, కంకిపాటి బాబురావు, సాగిన తిరుపతిరాజు, సాగిన శ్రీరాములు, గబులంగి వీరభద్రరావు, కంకిపాటి అప్పారావు, తగ్గి శ్రావణ్, కంకిపాటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.




## ఆడపిల్లలు అత్యవసర సమయంలో తమను తాము రక్షించుకోవాలి....





**కురుపాం, పెన్ పవర్, మార్చి 4:** అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలు లో భాగంగా గరుగుబిల్లి పోలీస్ ఆధ్వర్యంలో గరుగుబిల్లిలో ఉన్న దీ=×+ పాఠశాల యందు విద్యార్థినులకు గరుగుబిల్లి పోలీసులు సెల్ఫ్ డిఫెన్స్ మెలుకువలను కరాటే మాస్టర్ ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు నేర్పించారు. ఈ సందర్భంగా గరుగుబిల్లి ఎస్ఐ ఫక్రుద్దీన్ మాట్లాడుతూ ఆడపిల్లలు అత్యవసర పరిస్థితుల్లో తమను తాము రక్షించుకోవడానికి కావలసిన సెల్ఫ్ డిఫెన్స్ టెక్నిక్కున్ను నేర్పించడం జరిగిందని తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమం లో కరాటే మాస్టర్ ప్రభాకర్, గరుగుబిల్లి పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## విబి జీరామ్ జీ పై ప్రజల్లో అవగాహన కల్పించాలి

ఎంపీడీవో జె.ఉమామహేశ్వరి




**కురుపాం, పెన్ పవర్, మార్చి 4 :** కేంద్ర ప్రభుత్వం ఇటీవల పేరు ,నిబంధనలు మార్పు చేసి అమలు కు శ్రీ కారం చుట్టిన విబీ జీ రామ్ జీ (జాతీయ గ్రామీణ ఉపాధి పథకం) పై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీవో జె.ఉమామహేశ్వరి సూచించారు. ఎపీఓ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వికసిత్ భారత్ జీ రామ్ జీ (ఎఱఎంఠ్ దీప్థుథీఫ్ – + =ూవీ +)
ప్రధాన అంశాలపై అవగాహన కల్పించారు.
125 రోజుల హామీ కలిగిన వేతన ఉపాధి ,
గ్రామ సభ ద్వారా వికసిత్ గ్రామ పంచాయతీ ప్రణాళిక (ఎ+ూ),, నిరుద్యోగ భత్యానికి బలమైన నిబంధనలు
విజిపిపి లో అన్ని పథకాల సమన్వయం, (జశీఅజవతీస్త్రవఅఎవ), సమయానికి వేతన చెల్లింపు మరియు ఆలస్యానికి పరిహారం , సాంకేతికత ద్వారా సాధికారత (జుఎజూశీషవతీఎవఠ్) ముఖ్య ఉద్దేశ్యం అని తెలిపారు. ప్రజలలో నెలకొన్న అపోహలు తొలఖిపయో విధంగా గ్రామ స్థాయి నుండి అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు..డిప్యూటీ ఎంపీడీవో రమేష్ బాబు ఇంజనీరింగ్ అసిస్టెంట్ మూర్తి ,సాంకేతిక సహాయకులు ,క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

## జీడి రైతులకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి......

కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిరంజీవి.......



**నాతవరం పెన్ పవర్ (మార్చి 04):** జీడి పండించే రైతులకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కేవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిరంజీవి అన్నారు. బుధవారం మండల కేంద్రమైన నాతవరం జీడి తోటల వద్ద ప్లే కార్డులు పెట్టుకొని నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ జీడు రైతులకు కేజీకి 200 రూపాయలు మద్దతు ధర ఇవ్వాలని, దళారులకు నచ్చిన రేట్లు పెట్టి జీడి రైతులకు నష్టం కలిగిస్తున్నారని అన్నారు. ప్రభుత్వమే రైతు భరోసా కేంద్రాల్లో జీడిపిక్కలు కొనుగోలు చేయాలని, జీడి రైతులకు బ్యాంకులో రుణాలు ఇవ్వాలని, ఉపాధి హామీ పథకం ద్వారా జీడి తోటలు అభివృద్ధి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కే. ప్రసన్న, గిరిజన సంఘ నాయకులు నాగమణి పాల్గొన్నారు.

## లేటరైట్ అనుమతుల పేరిట ఆదివాసి గిరిజనుల పొట్ట కొట్టొద్దు.

ప్రజాభిప్రాయ సేకరణలో సిపిఐ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాలేపల్లి వెంకటరమణ.




**గూడెం కొత్తవీధి, పెన్ పవర్, మార్చి4:** అడవి తల్లిని నమ్ముకుని జీవిస్తున్న ఆదివాసి బిడ్డల పొట్ట కొట్టొద్దని, అదే క్రమంలో వారు సాగు చేస్తున్న విలువైన పంటలు నాశనం అయ్యేందుకు కారణం అవుతున్న లేటరైట్ అనుమతులను ప్రభుత్వాలు వెంటనే ఉపసంహరించుకోవాలని లేని పక్షంలో భారత కమ్యూనిస్టు పార్టీ ప్రజల పక్షాన నిలిచి ఉద్యమిస్తామని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాలేపల్లి వెంకటరమణ అన్నారు. డోకులూరు గ్రామంలో బుధవారం నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణకు ఆ పార్టీ అల్లూరి జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణతో కలిసి విచ్చేసిన ఆయన ప్రజలకు నష్టం కలిగించే లేటరైట్ అనుమతులకు వ్యతిరేకంగా ఆ ప్రాంత ప్రజలకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాభిప్రాయ సేకరణకు వ్యతిరేకంగా లేటరైట్ అనుమతులు ఇవ్వడం అన్యాయం అన్నారు. ఈ అనుమతుల వలన స్థానిక గిరిజనులకు అపార నష్టం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. వారు పండించే వాణిజ్య పంటలైన కాఫీ, మిరియాలు, పసుపు, రాజ్మా వంటి పంటలు, సేకరించే అటవీ ఉత్పత్తులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. అదే క్రమంలో భూగర్భ జలాలు అంతరించిపోయే ప్రమాదం లేకపోలేదన్నారు. పర్యావరణ సమతుల్యత దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. మన్య ప్రాంతంలో ఇప్పటికే అభివృద్ధి పేరిట అటవీ సంపదను నాశనం చేయడం వలన సకాలంలో వర్షాలు కురవని పరిస్థితి తలెత్తిందన్నారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వాలు మరలా ఒకవైపు లేటరైట్, మరోవైపు బాక్సైట్ అనుమతుల పేరుతో మన్య ప్రాంతంలో గిరిజనులను ఆందోళనకు గురి చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ సందర్భంగా ప్రజాభిప్రాయ సేకరణకు విచ్చేసిన పాడేరు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారిని తిరుమణి శ్రీ పూజ కు లేటరైట్ అనుమతులను రద్దు చేసేందుకు కృషి చేయాలని కోరుతూ సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పించారు.

## వైయస్ జగన్ కు ఘన స్వాగతం పలికిన జెడ్పీ చైర్ పర్సన్



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, మార్చి 04.** అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం తనయుడు చాణిక్య వివాహ వేడుకకు ముఖ్య అతిథిగా విచ్చేసిన వైసిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిను పుష్పగుచ్చం ఇచ్చి ఘనంగా స్వాగతం పలికినట్లు ఉమ్మడి విశాఖ జిల్లాలో చైర్పర్సన్, వైసిపి ఉత్తరాంధ్ర జోనల్ విభాగం మహిళా అధ్యక్షురాలు జల్లిపల్లి సుభద్ర తెలిపారు. బుధవారం అరకు ఎమ్మెల్యే తనయుని వివాహానికి హాజరైన జడ్పీ చైర్ పర్సన్ సుభద్ర మూర్తి దంపతులు నూతన వధూవరులు చాణిక్య, అశ్వినీలను ఆశీర్వదించారు. వివాహ బంధంతో నూతన జీవితంలోకి అడుగుపెడుతున్న నూతన దంపతులు సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. గిరిజన ప్రాంతంలో విచ్చేసిన వైసిపి అధినేత జగన్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# పోలీసుల "పల్లె నిద్ర" కార్యక్రమం







**కాజులూరు, పెన్ పవర్, మార్చి 4:** కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్, ఐపీఎస్ ఆదేశాల మేరకు, కాకినాడ ఎస్డీపీఓ మనీష్ దేవరాజ్ పాటిల్ ఆధ్వర్యంలో గొల్ల పాలెం పోలీస్ స్టేషన్ సబ్ఇన్స్పెక్టర్ ఎం. మోహన్ కుమార్ మంగళవారం రాత్రి ఐతపూడి గ్రామంలో "పల్లె నిద్ర" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మోహన్ కుమార్ తమ సిబ్బందితో కలిసి గ్రామంలో వీధి వీధి పర్యటించి, ప్రజలతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమ ముఖ్యాంశాలు: శాంతి భద్రతలు: గ్రామంలోని పరిస్థితులు, అసాంఘిక కార్యకలాపాలు, జులాయిల కదలికలపై ప్రజల అభిప్రాయాలు తెలుసుకుని, ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. అవగాహన సదస్సు: నూతన చట్టాలు, సైబర్ నేరాల పట్ల అప్రమత్తత, రోడ్డు భద్రతా నియమాలు, సామాజిక మాధ్యమాల వినియోగం, డ్రగ్స్ నిర్మూలన వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. నేరాల నియంత్రణ: ప్రస్తుత కాలంలో పెరుగుతున్న మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని, కొత్త వ్యక్తుల కదలికలపై నిఘా ఉంచాలని కోరారు. పటిష్టమైన నిఘా వ్యవస్థ: గ్రామంలోని ప్రధాన ప్రాంతాల్లో, గుళ్లు, విగ్రహాల వద్ద సీసీటీవీ కెమెరాలు, లైట్లు ఏర్పాటు చేయడానికి ప్రజలు సహకరించాలని సూచించారు. దీని ద్వారా నేరాలను ముందుగానే అడ్డుకోవచ్చని తెలిపారు. కఠిన హెచ్చరిక: అసాంఘిక కార్యకలాపాలు, గంజాయి వంటి మత్తు పదార్థాల వినియోగం, సామాజిక మాధ్యమాల్లో రెచ్చగొట్టే పోస్టులు పెట్టడం వంటి చర్యలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ఎం. మోహన్ కుమార్, పోలీసు సిబ్బంది, గ్రామ పెద్దలు, స్థానిక యువత పాల్గొన్నారు. గ్రామస్తుల సమస్యల పరిష్కారానికి వేగవంతమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు హామీ ఇచ్చారు.

## స్వామి వారి బ్రహ్మోత్సవాలకు తరలి రండి - స్వామివారి కృపకు పాత్రుల కండి

**గాజువాక: పెన్ పవర్, మార్చి04** జీవీఎంసీ 65 వార్డ్ వంబే కాలనీ గరుడాద్రి కొండపై శ్రీ వైకుంఠ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు తిలకించేందుకు భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించాలని ఆలయ ధర్మకర్త మంత్రి మంజుల, ఆలయ చైర్మన్ దొడ్డి రమణ తోపాటు ఇతర కమిటీ సభ్యులు ఆహ్వానం పలికేరు. దీనికి సంబంధించిన కరపత్రాలను ఆలయ ప్రాంగణంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రతినిధులు మాట్లాడుతూ స్వామివారి బ్రహ్మోత్సవాలను ఈనెల 12 13 14 తేదీలలో అత్యంత ఘనంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈనెల 11వ తేదీన స్వామి వారి ఊరేగింపు కార్యక్రమం తో ప్రారంభమైన ఈ బ్రహ్మోత్సవాలలో ఈ మూడు రోజులు స్వామివారికి ప్రత్యేక పూజలు, హోమాలు, అభిషేకాలు, ఆఖరి రోజు స్వామివారి చక్కర స్నానం తో పాటు స్వామివారికి ఎంతో ఇష్టమైన కోలాటం, భజనలు, భక్తి గీతాలు వివిధ సంస్కృత కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని ఈ మహోత్తర కార్యక్రమంలో భక్తులు యావన్మంది పాల్గొని స్వామివారి బ్రహ్మోత్సవాలను తిలకించి స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో పూడి శాంతి, పప్పల ఆదిలక్ష్మి, తిప్పల స్వాతి, ఓమి ఈశ్వరి, పెంటకోట రాజు, రమణ, రుక్మందర్రావు, లాభాల దుర్గాప్రసాద్, హిమజ, ఉషారాణి, స్వాతి మరియు ఆలయ సేవకులు భక్తులు పాల్గొన్నారు

# కొనసాగుతున్న ముస్లిం ఉపవాస దీక్షలు



**ఇఫ్తార్ విందులు, ప్రత్యేక నమాజ్ లతో కళకళ లాడుతున్న మజీద్.**

**విద్యుత్ దీప కాంతులతో మిరుమిట్లు గోల్పుతున్న ముస్లిం ల ప్రార్థనా మందిరం (మజీద్).**

**స్టాఫ్ రిపోర్టర్, చింతపల్లి/ గూడెం కొత్త వీధి, పెన్ పవర్, మార్చి 4:** ముస్లింలు అతి పవిత్ర మాసంగా భావించే రంజాన్ మాసంలో నిర్వహించుకునే కఠోర ఉపవాస (రోజా) దీక్షలలో భాగంగా ప్రతి రోజూ సాయంత్రం ఉపవాస దీక్ష విరమించే వేళలో ఎవరో ఒకరు ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందులు గడిచిన 15 రోజులుగా కొనసాగుతున్నాయి. మరో 15 రోజులపాటు ఇదే విధంగా కొనసాగనున్నాయి. మరలా నెలవంక దర్శనం అయ్యే వరకు ముస్లింలు ఈ ఉపవాస దీక్షలను అత్యంత భక్తిశ్రద్ధలతో ఆచరిస్తూ నెలవంక దర్శనం అయిన రోజున ఉపవాస దీక్షలను ముగించి ఆ మరుసటి రోజు రంజాన్ పర్వదినాన్ని ఘనంగా నిర్వహించుకుంటారు.

## ఆరోగ్య శాఖ సరఫరా చేసిన ఓఆర్ఎస్ ప్యాకెట్లు మాత్రమే వినియోగించాలి



అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, శ్రీకాకుళం. మార్చి 04:** జిల్లాలో ఆరోగ్య శాఖ సరఫరా చేసే ఓఆర్ఎస్ ప్యాకెట్లు మాత్రమే వినియోగించాలని అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్ వెల్లడించారు. బుధవారం రిమ్స్ లో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓ. ఆర్.ఎస్ ప్యాకెట్లు ఔ.ఎ.వా నిబంధనల ప్రకారం అతిసారం నుండి, దానివలన కలిగే డీహైడ్రేషన్ కట్టడిచేయు లవణాలు, వివిధ పోషకాలు కలిగి ఉంటాయన్నారు. బయట లభించే ఫ్యాన్సీ ఓ. ఆర్.ఎస్ ప్యాకెట్లు ఔ.ఎ.వా నిబంధనలు ప్రకారం లేని ద్రావణాలని, వాటిలో నిర్దేశించిన పునర్జలీకరణ జరగదని వివరించారు. ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉంటూ కేవలం ప్రభుత్వ వైద్య సిబ్బంది వారు సరఫరా చేసిన ఓ. ఆర్.ఎస్ ప్యాకెట్లు మాత్రమే వాడుట ఆరోగ్యానికి మంచిదని ఆయన తెలిపారు.

జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి డావ కె. అనిత మాట్లాడుతూ ప్రజలందరూ బాగా తెర్లికాచి, చల్లార్చిన నీటిని మాత్రమే త్రాగాలని, త్రాగునీటి పైన మూతలు పెట్టి ఉంచాలన్నారు. ప్రతీ ఒక్కరు చేతులు పరిశుభ్రత పాటించాలన్నారు. ఆహారం తినేముందు చేతులను మోచేతివరకు శుభ్రంగా కడుక్కోవాలని, మలమూత్ర విసర్జన తరువాత బయట నుండి ఇంటికి వచ్చినప్పుడు ప్రతీసారి చేతులు కడుక్కోవాలని వివరించారు. ఆహారపదార్థాలను బాగుగా ఉడికించి వండిన తరువాత మాత్రమే తినాలని పేర్కొన్నారు. పచ్చి కూరగాయలను, పచ్చి ఆహార పదార్థాలను తినరాదని, ప్రస్తుత వాతావరణ పరిస్థితులలో జరిగిన మార్పులకు అనుగుణంగా మాంసహార ఉత్పత్తులను తగ్గించి తేలికగా జీర్ణమయ్యే కూరగాయలను భుజించాలని వివరించారు. ప్రజల సౌలభ్యార్థం, సౌకర్యార్థం తగు సూచనలు ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్, ఇతర వైద్య విభాగాధిపతులు, తదితరులు పాల్గొన్నారు.

## మాజీ సీఎం విశాఖ పర్యటన సందర్భంగా భారీగా తరలి వెళ్ళిన 87 వార్డు వైఎస్ఆర్సిపి నాయకులు



**కూర్మన్నపాలెం,:** జీవీఎంసీ 87 వ వార్డు పరిధిలో గల కణితి గాంధీ బొమ్మ జంక్షన్లో నుంచి ఎయిర్పోర్ట్ వరకు వైఎస్ఆర్సిపి వార్డ్ అధ్యక్షులు బొడ్డ గోవిందా ఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రివర్యులు జగన్మోహన్ రెడ్డి విశాఖ పర్యటనకు వస్తున్న సందర్భంగా స్వాగతం పలికేందుకు భారీగా తరలిన 87వ వార్డు వైఎస్ఆర్సిపి నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు వార్డు అధ్యక్షులు బొడ్డ గోవిందా ప్రగడ శ్రీనివాస్ ఎన్నేటి రమణ చిత్రాడ వెంకటరమణ దుగ్గపు దానప్పలు ఎస్ పాపారావు బొడ్డ సన్యాసిరావు బొడ్డ వెంకట సూరి పిన్నింటి సంతోష్. గాలి నూకరాజు పాపారావు గున్నా రామారావు కాంద్రేగుల కోటి రవి గణపతి బ్రహ్మం కనక లక్ష్మి సత్యవతి పార్వతి సత్తిబాబు కృష్ణ బాబ్జి సంజయ్ రాజు మొన్న ప్రకాష్ రాజు. తదితరులు పాల్గొన్నారు.

# మహిళా హింసపై ఐక్యంగా పోరాడాలి




**పెద్దాపురం, పెన్ పవర్, మార్చి 4 :** స్త్రీలపై జరుగుతున్న అన్ని రకాల హింసలకు వ్యతిరేకంగా మహిళలు ఐక్యంగా పోరాడాలని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు పిలుపునిచ్చారు. బుధవారం పెద్దాపురం మండలం పులిమేరు గ్రామంలో ప్రగతిశీల మహిళా సంఘం (స్త్రీ విముక్తి) ఆధ్వర్యంలో నిర్వహించిన సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. అమెరికా, యూరప్ దేశాల్లో మహిళలు ప్రాణ త్యాగాలతో సాధించుకున్న ఎనిమిది గంటల పనిదినం, ఇతర హక్కులను నేటి పాలకవర్గాలు కాలరాస్తున్నాయని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం మనువాద భావజాలంతో మహిళలను వంటింటికే పరిమితం చేసే కుట్ర చేస్తోందని, రాష్ట్ర ప్రభుత్వం పది గంటల పని దినం, నైట్ షిఫ్ట్ల వంటి వ్యతిరేక విధానాలను తెస్తోందని ఆరోపించారు. మద్యం, డ్రగ్స్, గంజాయి నియంత్రణలో ప్రభుత్వం విఫలమైందని, దీనివల్ల నేరాలు పెరిగి పసిపిల్లల నుంచి వృద్ధుల వరకు రక్షణ లేకుండా పోతోందని జిల్లా నాయకురాలు రెడ్డి దుర్గాదేవి ఆందోళన వ్యక్తం చేశారు. సమాన పనికి సమాన వేతనం కల్పించాలని, పితృస్వామ్య పోకడలను నశింపజేయాలని, మహిళా హక్కుల రక్షణకు ప్రతీ ఒక్కరూ నడుం బిగించాలని నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీఆర్సీఎస్ జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాజబాబు, ఏఐఎఫ్ టీయూ నాయకులు కుంచె అంజిబాబు, పీడీఎస్యూ నాయకులు కడితి సతీష్, మహిళా సంఘం నేతలు పైడిమల్ల యమున, నూకరత్నం తదితరులు పాల్గొన్నారు.


# శిక్షణా తరగతులతో నాయకత్వ లక్షణాల పెంపు

**రామచంద్రపురం పెన్ పవర్, మార్చి 4:** పార్టీ శిక్షణా తరగతుల ద్వారా నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవచ్చని కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం పేర్కొన్నారు.మంగళగిరి లోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో ఈ నెల 5, 6 తేదీలలో నిర్వహించనున్న శిక్షణా తరగతులకు రామచంద్రపురం నియోజకవర్గం నుంచి పలువురు నాయకులు, క్లస్టర్ ఇన్‌చార్జిలు బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా వాహనాన్ని వాసంశెట్టి సత్యం, ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, పట్టణ అధ్యక్షులు ఉండవల్లి శివ జెండా ఊపి ప్రారంభించారు.వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ, పార్టీ బలోపేతం, నాయకులుకార్యకర్తల మధ్య సమన్వయం పెంపు, ప్రభుత్వ పథకాలపై స్పష్టమైన అవగాహన, ప్రజలతో సాన్నిహిత్యం పెంచడం లక్ష్యంగా ఈ శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆధునిక రాజకీయ పరిస్థితుల్లో సోషల్ మీడియా వినియోగం, బూత్ స్థాయి బలోపేతం, ఎన్నికల వ్యూహాలు, ప్రజా సమస్యల పరిష్కారంలో చురుకుదనం వంటి అంశాలపై ప్రత్యేక మార్గదర్శకాలు అందజేయబడతాయని పేర్కొన్నారు.ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్ మాట్లాడుతూ, పార్టీ సిద్ధాంతాలను ప్రతి గ్రామం, ప్రతి వార్డుకు చేర్చే బాధ్యత క్లస్టర్ ఇన్‌చార్జిలదేనని, శిక్షణ ద్వారా వారికి మరింత స్పష్టత,ధైర్యం, నాయకత్వ నైపుణ్యాలు పెంపొందుతాయని అన్నారు. రామచంద్ర పురం నియోజకవర్గం నుంచి భారీ స్థాయిలో నాయకులు పాల్గొనడం పార్టీ పట్ల ఉన్న అంకితభావాన్ని సూచిస్తుందని తెలిపారు.శిక్షణా తరగతులకు హాజరవుతున్న వారిలో మేడిశెట్టి సూర్యనారాయణ, కంచుమర్తి బాబురావు, పెంకె సాంబశివరావు, చెల్లి గోపాలకృష్ణ, పలివెల ప్రకాష్, వనుం వీరబ్రహ్మం, పలివెల రాజు, సలాది సాయిబాబా, సలాది పట్టాభిరామయ్య, మరివాడ సూరిబాబు తదితరులు ఉన్నారు.ఈ కార్యక్రమంలో వాసంశెట్టి సత్యం, అక్కల రిశ్వంత్ రాయ్, ఉండవల్లి శివ, చందమామ వాసు, కవల నానాజీ, గేదల దొరబాబు తదితరులు పాల్గొన్నారు. పార్టీ మరింత బలోపేతం దిశగా ఈ శిక్షణా తరగతులు మైలురాయిగా నిలుస్తాయని నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు.




03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## ప్రధానమంత్రి సురక్ష బీమా చెక్కు అందజేత




**కాట్రేనికోన, పెన్ పవర్ మార్చి 4:**ప్రధానమంత్రి సురక్ష బీమా బీమా యోజన (పి ఎం ఎస్ బి వై) పథకం ద్వారా వార్షిక ప్రీమియం కేవలం 20 రూపాయలు చెల్లించడం ద్వారా పడవ మునిగి మరణం పొందిన ఖాతాదారునికి రెండు లక్షల రూపాయల ప్రమాద బీమా లభిస్తుందని కాట్రేనికోన స్టేట్ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ జి బి వి రమణ తెలిపారు. కాట్రేనికోన మండలం పల్లం గ్రామానికి చెందిన కొప్పుడి మహేష్ ఇటీవల మరణించగా ఆయన భార్య కొప్పుడి మంగ కి రెండు లక్షల రూపాయల బీమా చెక్కును బుధవారం మేనేజర్ అందించారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ మాట్లాడుతూ బ్యాంకులో ఖాతా ఉన్న ప్రతి ఒక్కరూ జీవిత బీమా, ప్రమాద బీమా పాలసీ చేయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ బ్యాంక్ మేనేజర్ మహేష్ బాబు,జి విజయ్ కుమార్, ప్రశాంత్ ఇంకా స్టేట్ బ్యాంక్ సిబ్బంది, కియోస్క్ బ్యాంక్ ఆపరేటర్లు పెయ్యల సురేష్ బాబు, పాలెపు సత్యానందం , మల్లాది రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యానవన పంటలపై రైతులకు అవగాహన సదస్సు.





**ఏలేశ్వరం, పెన్ పవర్, మార్చి 4:** మండల పరిధి గ్రామాల్లో ఉద్యానవన పంటలపై రైతులకు అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. మండల ఉద్యాన వన శాఖ అధికారిణి కె. దివ్యశ్రీ ఆధ్వర్యంలో మర్రివీడు ,పరిమితడక ,జె. అన్న వరం,తూర్పు లక్ష్మీపురం , లింగంపర్తి,పేరవరం గ్రామాలలో ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మానుకొండ శ్రీనివాస్ ,ఉద్యాన పంటలు,మామిడి , జీడిమామిడి లో సమగ్ర సస్యరక్షణ , మేలైన ఎరువుల యాజమాన్య పద్ధతులు గూర్చి రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు .ఉద్యాన పంటలలో పాటించవలసిన ఎరువుల యామాన్యం గురించి వివరించారు. మామిడిలో రసం పీల్చే తామర పురుగులు , తేనే మంచు పురుగులు నివారణకు, వేప నూనె 5. మిల్లీలు , కార్బన్డిజం 1 గ్రా. లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. డైమెథోయేట్ 2 మిల్లీలీటర్ల లీటర్ నీటికి కలిపి పూత మొదలయ్యే సమయంలో , పిందె తయారు అయ్యే సమయంలో పిచికారీ చేయాలి అని తెలిపారు. .ఇమిడాక్లోప్రిడ్ 0.3 మి.లీ , లేదా లామడా సైహలోత్రిన్ 2.0 మి.లీ +నీటిలో కరిగే గంధకం 3 గ్రా, పిప్రోనిల్ 2. మి లీ+ మాంకోజబ్ 3 గ్రా. పై మందులు ఒక లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేస్తే చాలా రకాల పురుగులు నివారణ చేయబడతాయని అన్నారు. మామిడిలో పొటాషియం నైట్రేట్ 10 గ్రాములు లీటరు నీటికి చొప్పున కలిపి పిందె గోలీకాయల సైజ్ ఉన్నప్పుడు పిచికారి చేయటం వలన అధిక దిగుబడులు పొందవచ్చని వివరించారు.మామిడి కాయలకు కవర్లు (ఫ్రూట్ కవర్స్) కట్టుకోటం ద్వారా పండ్ల నాణ్యత పెరుగుతుందని వివరించారు .
మామిడిలో పిందె ఏర్పడిన తర్వాత ఫిబ్రవరి రెండో వారం లో మొక్కకు 500 గ్రాముల యూరియా ,750 గ్రాముల పోటాష్,500 గ్రాముల సూపర్ పాస్ఫేట్ చొప్పున ఎరువులు అందించాలని తెలిపారు జీడిమామిడి లో తేయాకు దోమ నివారణకు మోనోక్రోటోఫాస్ 1.6 మి లీ, పూత సమయంలో లామడా సైహలోత్రిన్ 2.0 మి.లీ , బటాణి గింజ దశలో ప్రొఫెనోఫాస్ 2 మి లీ, కార్బన్డిజం 1 గ్రా, లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు.
ఆయిల్ పామ్ తోటలలో యాజమాన్య పద్ధతులను వివరించారు .రసం పీల్చే రుగోస్ తెల్ల దోమ నివారణకు వేపనూనె, నల్లకొమ్ము పురుగు నివారణకు మొవ్వులో 5-10గ్రాములు ఫెర్టరా గుళికలు పెట్టుకోవాలని,లింగకర్షక ఎరలను ఏర్పాటు చేయాలని తెలిపారు.అరటిలో దుంప పుచ్చు నివారణకు ప్రోపికనజోల్ మందును మొక్క మొదలు తడిచేలా పిచికారీ చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు,గ్రామ ఉద్యాన వ్యవసాయ సహాయకులు నిఖిల్ , సువర్ణ లత, నిఖిల్ వెంకటసాయి, నానిబాబు, రాజ్ కుమార్,దీప్తి , సింహాద్రి గ్రామ రైతులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ మహిళా దినోత్సవం 2026

### మార్చి 2 నుంచి 20 వరకు జిల్లావ్యాప్తంగా కార్యక్రమాలు






**కాకినాడ, పెన్ పవర్, మార్చి 4:**జిల్లా కలెక్టర్ షగిలి షాన్ మోహన్ ఆదేశాల మేరకు, జాయింట్ కలెక్టర్ కుమారి మనీషా పటేల్ పర్యవేక్షణలో జిల్లా మహిళా మరియు శిశు సంక్షేమ సాధికారిత అధికారిణి, జిల్లా స్త్రీ మరియు శిశు అభివృద్ధి సంస్థ అధికారిణి శ్రీమతి సి.హెచ్. లక్ష్మి అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవం2026 కార్యక్రమాలపై జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించబడింది.మార్చి 2, 2026 నుండి మార్చి 20, 2026 వరకు జిల్లాలోని వివిధ శాఖల సమన్వయంతో సమావేశాలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రోగ్రామ్ షెడ్యూల్‌పై చర్చించారు. ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని కాకినాడ కలెక్టరేట్ కోర్ట్ హాల్‌లో నిర్వహించేందుకు నిర్ణయించారు.ఈ కార్యక్రమాల్లో సైబర్ సెక్యూరిటీ, పి.సి. & పి.ఎన్.డి.టి చట్టం, రుణ మేళా, స్కిల్ డెవలప్మెంట్, టీనేజ్ ప్రెగ్నెన్సీస్, బాల్య వివాహాలు వంటి ముఖ్య అంశాలపై అధికారులతో చర్చించారు. వివిధ శాఖల్లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులలో ప్రతిభ కనబరిచిన వారికి మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా "బెస్ట్ ఎంప్లాయీ అవార్డ్స్" ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ కుమారి మనీషా పటేల్ మాట్లాడుతూ, అన్ని శాఖల సమన్వయంతో కార్యక్రమాలను విజయవంతం చేయాలని సూచించారు. ప్రతి రోజు నిర్వహించిన కార్యక్రమాలపై డైలీ రిపోర్టులు, ఫోటోలు, చిన్న వీడియోలు, బ్రీఫ్ నోట్ మరియు హాజరైన వారి సంఖ్య వివరాలను లైజనింగ్ అధికారి ద్వారా జిల్లా స్త్రీ మరియు శిశు అభివృద్ధి సంస్థ అధికారిణికి వాట్సాప్ గ్రూప్ ద్వారా పంపించాలని అధికారులకు ఆదేశించారు.

## వాహనాల రిజిస్ట్రే షన్, లైసెన్స్ జారీ ప్రక్రి యలు వేగవంతం చేయాలి



**వాహనదారులు నిబంధబలు తప్పక పాటించాలి**

**– జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్**

**అమలాపురం/అంబాజీపేట, పెన్ పవర్, మార్చి 4:** జిల్లా రోడ్డు రవాణా సంస్థ అధికారులు, వాహనదారు లకు ప్రజలకు అందిస్తున్న సేవలలో నాణ్యత, పారద ర్శకత పెంచి వేగవంతమైన సేవల ద్వారా మెరుగైన పనితీరు కనపరచాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ ఆదేశించారు బుధవారం స్థానిక కలెక్టరేట్ నందు జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా రోడ్డు రవాణా సంస్థ, రావులపాలెం రామచంద్రపురం మోటార్ వెహికల్ ఇన్స్పె క్టర్ల కార్యాలయాల పనితీరుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాల రిజిస్ట్రే షన్, లైసెన్స్ జారీ ప్రక్రి యలు వేగవంతం చేస్తూ సకా లంలో పూర్తి చేయాలన్నారు. పెండింగ్ దరఖాస్తులను నిర్దిష్ట గడువులో పరిష్కరించాలని సూ చించారు .రోడ్డు భద్రతా నియమాల ఉల్లంఘనల పట్ల పట్ల అపరాధపు రుసుములు విధించడం తోపాటు కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఆన్‌లైన్ సేవలను ప్రజలకు సులభంగా అందుబాటు లో ఉంచాలని సూచించారు. అవినీతి రహిత సేవలు అం దించేందుకు పర్యవేక్షణ వ్యవస్థను బలోపేతం చేయాలని పేర్కొన్నారు. ప్రజల సమయాన్ని ఆదా చేసే విధంగా పారదర్శక వ్యవస్థలు అమలు చేయాలని, ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకోవాలని అధి కారులకు సూచించారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించేందు కు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కూడా సూచించారు. రవాణా సేవల సామర్థ్యం వాహనాల ఫిట్నెస్ ధ్రువ పత్రాలు లైసెన్సులు జారీ సవ్యంగా చేపడుతూ రోడ్డు భద్రతా చర్యల్లో మెరుగైన పురోగతి కనబరచాలన్నారు. హెల్మె ట్ , సీట్ బెల్ట్ ధరించడం రోడ్డు నియమ నిబంధనలు ఉల్లంఘించి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్య లు తీసు కుంటూ ప్రమాదాల సంఖ్యను గణనీయంగా తగ్గించి రక్షణతో కూడిన రవాణా వ్యవస్థను తీసుకుని రావాలన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవా లు-2026లో ప్రజలకు రహదారి భద్రత నియమావళి పట్ల అవగాహన పెంపొందించా లన్నారు.బ్లాక్ స్పాట్లలో రోడ్డు ప్రమాదాల నివారణ కు మరిన్ని భద్రత చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్టిసి బస్సుల్లో జీరో ప్రమాదాల లక్ష్యంతో డ్రైవర్ల శిక్షణను బలోపేతం చేయాలన్నారు. ప్రజా రవాణా వ్యవస్థను సరుకుల రవాణా వ్యవస్థలను మరింత శక్తివంతం చేయా లన్నారు. ఆటో డ్రైవర్ల సేవలో (వాహన మిత్ర) భాగంగా అర్హులైన వారందరికీ రూ,15వేలు గ్రాంట్ అందిస్తూ జిల్లా రవాణా శాఖ పరంగా జిల్లాను ముందు వరుసలో నిలపాల న్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రోడ్డు రవాణా అధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్లు రాజేంద్ర ప్రసాద్ శ్రీనివా సరావు రవికుమార్ కౌశిక్ తదితరులు పాల్గొన్నారు.

## మానవత్వంతో స్పందించిన సర్పంచి పెద్దిరెడ్డి రాము



**అమలాపురం/అంబాజీపేట, పెన్ పవర్, మార్చి 4:**అమలాపురం రూరల్ మండలం గున్నేపల్లి అగ్రహారం గ్రామ సర్పంచ్ పెద్దిరెడ్డి రాము మానవత్వంతో స్పందించారు. సుందర్ నగర్ కాలనీకి చెందిన పాసెం కృష్ణవేణి అనే మహిళ క్యాన్సర్ సమస్యతో కొంతకాలంగా బాధపడుతున్నది. ఈ విషయం తెలుసుకున్న సర్పంచ్ రాము మానవతా దృక్పథంతో ముందుకు వచ్చి ఆమె వైద్య ఖర్చుల నిమిత్తం రూ 5వేలు ఆర్థిక సాయం అందించి సేవా దృక్పథాన్ని చాటుకున్నారు. తన వంతు ఆర్థిక సాయం చేసిన సర్పంచ్ రామును ప్రతీ ఒక్కరు అభినందించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి దుర్గాభవాని, పెద్దిరెడ్డి శ్రీరామ్మూర్తి, అనుపిండి సీతారామయ్య, పేరాబత్తుల నాగభూషణం, చొల్లంగి సాయిబాబా పాల్గొన్నారు.

## కాకినాడ దంత వైద్యులచే ఘనంగా హోలీ పండుగ వేడుకలు



**కాకినాడ, పెన్ పవర్, మార్చి 4:**స్థానిక ఎస్‌పిసిఎ ఆవరణలో కాకినాడ దంత వైద్యులచే శ్రీ కృష్ణుని విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం హోలీ పండుగను అత్యంత ఉత్సాహంగా, ఘనంగా జరుపుకున్నారు.
ఈ సందర్భంగా డా. అడ్డాల సత్యనారాయణ మాట్లాడుతూ, హోలీ పండుగను "రంగుల పండుగ"గా పిలుస్తారని, ఇది వసంత కాలంలో వచ్చే ముఖ్యమైన హిందూ పండుగలలో ఒకటని తెలిపారు. ప్రతి సంవత్సరం ఫాల్గుణ మాసం పౌర్ణమి రోజున హోలీని ఆనందోత్సాహాలతో జరుపుకుంటారని పేర్కొన్నారు.హోలీకి ముందు రోజు రాత్రి 'హోలికా దహనం' నిర్వహించడం ఆనవాయితీ అని, చెడుపై మంచి సాధించిన విజయానికి ఇది ప్రతీక అని వివరించారు. మరుసటి రోజు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ, కులమతాలకు అతీతంగా అందరూ కలిసి మెలిసి సంతోషంగా జరుపుకునే పండుగ ఇదని అన్నారు.హోలీ పండుగ వెనుక ప్రధానంగా ప్రహ్లాదుడు హిరణ్యకశ్యపుడి కథ ఉందని, విష్ణుభక్తుడైన ప్రహ్లాదుడిని హతమార్చాలని ప్రయత్నించిన రాక్షసి హోలిక మంటల్లో కాలిపోగా, ప్రహ్లాదుడు సురక్షితంగా బయటపడిన ఘటనకు గుర్తుగా ఈ పండుగను జరుపు కుంటారని తెలిపారు.ఈ సందర్భంగా శత్రుత్వాలను మరచి పరస్పరం స్నేహభావంతో మెలగాలని పిలుపునిచ్చారు. పూర్వకాలంలో సహజ సిద్ధమైన రంగులతో హోలీ ఆడేవారని, ప్రస్తుతం రసాయన రంగులకంటే సహజ రంగులను వినియోగించడం ఆరోగ్యానికి, పర్యావరణానికి మేలు చేస్తుందని సూచించారు.ఈ కార్యక్రమంలో రామ్ మంతెన, డాక్టర్ చైతన్య, డాక్టర్ నాగేంద్ర, డాక్టర్ పద్మావతి, డాక్టర్ స్వరూప్, డాక్టర్ కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా పశుసంవర్ధక శాఖ ఇన్‌చార్జి జేడీగా వి. శ్రీధర్ బాధ్యతలు



**కాకినాడ, పెన్ పవర్, మార్చి4 :** కాకినాడ పశుసంవర్ధక శాఖ పాలిక్లినిక్ డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్న వి. శ్రీధర్, కాకినాడ జిల్లా పశుసంవర్ధక శాఖ ఇన్‌చార్జి జాయింట్ డైరెక్టర్ (ఎఫ్ఏసీ)గా బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా బుధవారం ఆయన కాకినాడ జిల్లా కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ షణ్మోహన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా పశుసంవర్ధక శాఖ అభివృద్ధి, రైతులకు మెరుగైన సేవలు అందించే దిశగా కృషి చేస్తానని శ్రీధర్ తెలిపారు.

# 98 మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

**జగ్గంపేట, పెన్ పవర్, మార్చి 4:** పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఒక ఆర్థిక భరోసా అని, పేద కుటుంబాలు వైద్యంకోసం దరఖాస్తు చేసిన వెంటనే సీఎం నిధులు మంజూరు చేస్తున్నారని టీడీపీ కాకినాడ జిల్లా అధ్యక్షులు, జగ్గంపేట నియోజకవర్గం అభివృద్ధి కమిటీ చైర్మన్ జ్యోతుల నవీన్ అన్నారు. స్థానిక రావులమ్మ నగర్ లోని టీడీపీ కార్యాలయంలో బుధవారం సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేశారు. 98మంది ఆపన్నులకు రూ. 54.92 లక్షల సహాయనిధి చెక్కులు పంపిణీ చేశారు. ఈ రోజుల్లో ప్రతి ఒక్కరికి అనారోగ్య రుగ్మతలు వస్తున్నాయని కానీ వైద్యం చేయించుకోలేని పరిస్థితి ప్రతి ఒక్కరిలోనూ ఉందని రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, నియోజవర్గంలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఎంతో కష్టపడుతున్నారని వారికి మీ ఆశీస్సులు ఇవ్వాలని అన్నారు. మీరు తీసుకోవడమే కాకుండా పదిమందికి ఈ పథకం గురించి తెలియజేయాలని ఈ నియోజకవర్గాన్ని అన్ని రంగాలను అభివృద్ధి చేయడంలో టీడీపీ ప్రభుత్వం ముందుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




## ర్యాలి గ్రామంలో జగన్మోహిని కేశవ & గోపాల స్వామి ఆలయ సంప్రోక్షణ ఘనంగా భక్తులకు దర్శనాలు ప్రారంభం




ర్యాలి గ్రామంలో వేంచేసి యున్న అతి పురాతనమైన దేవాలయం శ్రీ జగన్మోహిని కేశవ స్వామి ఆలయం బుధవారం సంప్రోక్షణ మహోత్సవం వైభవంగా నిర్వహించబడింది. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక హోమాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించి ఆలయాన్ని పవిత్రీకరించారు. సంప్రోక్షణ అనంతరం శ్రీ జగన్మోహిని కేశవ స్వామి గోపాల స్వామి వారి దర్శనాలు భక్తులకు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా గ్రామస్థులు, పరిసర ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. కార్యక్రమంలో దేవస్థాన కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. సంప్రోక్షణ అనంతరం నిత్యపూజలు, ప్రత్యేక సేవలు యథావిధిగా కొనసాగనున్నట్లు ఆలయ వర్గాలు వెల్లడించాయి.

## జగ్గంపేట సబ్ డివిజన్ లో పెరిగిన పంట సాగు విస్తీర్ణం

✷ వ్యవసాయ అధికారులను అభినందించిన ఎమ్మెల్యే



**జగ్గంపేట, పెన్ పవర్, మార్చి 4:** ప్రస్తుత రబీ కాలంలో జగ్గంపేట సబ్ డివిజన్లోని గండేపల్లి, జగ్గంపేట, ప్రత్తిపాడు, ఏలేశ్వరం మండలాల్లో రైతులు వివిధ రకాల పంటలైన వరి, మొక్కజొన్న, శనగలు, మినుములు, పెసలు, నువ్వులు, పొగాకు సాగు చేస్తున్నారని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు గరిమెళ్ళ శ్రీనివాస్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ వ్యవసాయ శాఖ ఈ పంట నమోదు ద్వారా సాగు విస్తీర్ణాలు లెక్కించారన్నారు. మొత్తం సబ్ డివిజన్ లో 27530 ఎకరాలలో పంట సాగు జరుగుతుందన్నారు. గత రబీలోని 19417 ఎకరాలతో పోలిస్తే సుమారు 8వేల ఎకరాలు విస్తీర్ణం పెరిగిందన్నారు. వరి, మొక్కజొన్న, శనగలు, మినువులు విస్తీర్ణం గణనీయంగా పెరగడం మరియు పంట నమోదు కూడా శాస్త్రీయబద్ధంగా చేయడం ద్వారా ఈ అభివృద్ధి కనబడిందని తెలిపారు. ఈ వివరాలన్నీ జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూకు తెలియచేశామని ఆయన వ్యవసాయ శాఖ సిబ్బందిని అభినందించారని తెలియజేశారు. ప్రస్తుతం గండేపల్లి మండలంలో శనగల కొనుగోలు కేంద్రం యల్లమిల్లి గ్రామంలో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అలాగే రబీ వరి కొనుగోలు కేంద్రాలు కూడా గండేపల్లి మండలంలో మరో 10-15 రోజుల్లో ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

## వాడపల్లి క్షేత్రంలో భక్తుల రద్దీ నిత్య అన్నదానానికి భక్తులు విరాళాలు





**ఆత్రేయపురం పెన్ పవర్ మార్చి 4:** కోనసీమ తిరుమల గా ప్రసిద్ధి చెందిన వాడపల్లి క్షేత్రానికి తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి భక్తులు వేలాదిగా తరలివస్తున్నారు. బుధవారం స్వామివారి దర్శనార్థం భారీగా భక్తులు చేరుకుని నిలువెత్తు దర్శనం చేసుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడగా, భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించబడ్డాయి.

ఈ సందర్భంగా ఆలయంలో ప్రతిరోజూ నిర్వహించే నిత్య అన్నదాన కార్యక్రమానికి దాతలు ఉదారంగా విరాళాలు అందించారు. విజయవాడ బెంజ్ సర్కిల్ ప్రాంతానికి చెందిన కామినేని రాజా శ్రీనివాస్ నాగమణి దంపతులు తమ కుటుంబ సభ్యులతో కలిసి రూ. 1,00,116లను సమర్పించి అన్నప్రసాద వితరణకు తోడ్పడ్డారు. అలాగే అనపర్తి కి చెందిన ఇందిగా సుబ్రహ్మణ్యం దంపతులు తమ కుటుంబ సభ్యులతో కలిసి 20,116/-లను విరాళంగా అందజేశారు. దాతలను ఆలయ అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించగా, ఆలయ సూపరింటెంట్ పులపర్తి రాంబాబు స్వామివారి చిత్రపటాన్ని బహుకరించి సత్కరించారు. భక్తుల సహకారంతో నిత్య అన్నదాన కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోందని ఆలయ వర్గాలు తెలిపారు.

## మిషన్ శక్తిపై జగ్గంపేటలో అవగాహన



**జగ్గంపేట, పెన్ పవర్, మార్చి 4:** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో మిషన్ శక్తి పేరిట 20 రోజులు అవగాహన కార్యక్రమాలు మార్చి 2వ తేదీ నుండి 20వ తేదీ వరకు ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. బుధవారం జగ్గంపేట మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో సైబర్ భద్రత డిజిటల్ అవగాహన పై మహిళలకు వివరించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ రాజశేఖర్ మాట్లాడుతూ సోషల్ మీడియా ప్రైవేసి పాటించాలని, అనుమానస్పద లింకులు, ఇమెయిల్, కాల్స్ పట్ల జాగ్రత్త వహించాలని, తెలియని వారు పంపిన లింక్ లు ఓపెన్ చేయకుండా ఉండాలని, ఎవరికైనా ఆన్లైన్ బెదిరింపులు, వేధింపులు జరిగితే సహాయం కోరాలన్నారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ పూర్ణిమ, ఏపిఎం వై. ఉమామహేశ్వరరావు, ఎం ఎస్ కె రేవతి, సూపర్ వైజర్ లు సునీత, అమ్మాజీ, మహిళా సంఘం సభ్యులు, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## రెవెన్యూ సేవలను మరింత పారద ర్శకంగా అందించాలి



✷ జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్

**అమలాపురం/అంబాజీపేట, పెన్ పవర్, మార్చి 4:** డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో రెవెన్యూ సేవలను మరింత పారద ర్శకంగా, వేగవంతంగా, ప్రజలకు సులభంగా అందించేందుకు ప్రభుత్వం చేపట్టిన పలు కార్యక్రమాల సమర్థవంతం గా అమలుచేసి ఆయా అంశాలలో ఆశించిన పురోగతిని చేరుకోవాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ రెవిన్యూ అధికారులను ఆదేశించారు బుధవారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి సాయి ప్రసాద్ భూ పరిపాలన ముఖ్య కమిషనర్ జి జయలక్ష్మిలు రెవెన్యూ క్లినిక్ భూముల బదలాయిశీపు పట్టాదారు పాస్ పుస్తకాల్లో తప్పులు సవరణ, రీ సర్వే 2.0 కుల విచారణ డిజిటల్ రెవెన్యూ రిజిస్టరీ అంశాల పురోగతిపై జిల్లాల వారీగా సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ రెవెన్యూ అధికారులను ఉద్దేశించి ప్రసంగిస్తూ పీ జీ ఆర్ ఎస్ రెవెన్యూ క్లినిక్లు ద్వారా భూ సమస్యలకు తక్షణ పరిష్కారం కల్పిం చేందుకు సమిష్టిగా కృషి చేయాలన్నారు. గ్రామ/వార్డు స్థాయిలో నిర్వహి స్తున్న ఈ క్లినిక్లలో భూ వివాదాలు, రికార్డు లోపాలు, హక్కుల బదిలీలు వంటి అంశాలపై అధికారుల సమక్షంలోనే పరిష్కార చర్యలు తీసుకోవాలన్నారు

మ్యూటేషన్లు భూ హక్కుల బదిలీ నమోదు విషయంలో, దరఖాస్తుల పరిశీలనను వేగవంతం చేసి, నిర్దిష్ట గడువులోగా ఆమోదాలు పూర్తిచేయడానికి ప్రత్యేక దృష్టి సారించాలన్నారు పెండింగ్ కేసుల సంఖ్య గణనీయంగా తగ్గించడమే లక్ష్యంగా సిబ్బంది అంకిత భావం జవాబుదారీతనంతో పాటుపడాలన్నారు పట్టాదారు పాస్ పుస్తకాలలో తప్పుల సవరణ కోసం ప్రత్యేక డ్రైవ్ చేపట్టి. పేర్లు, సర్వే నంబర్లు, విస్తీర్ణం వంటి వివరాల్లో ఉన్న పొరపాట్లను సరిచేసి రైతులకు ఖచ్చితమైన రికార్డులు అందించేందుకు పటిష్టమైన చర్యలను కొనసాగించాలన్నారు.

జీరో ఖాతాలు సంబంధిత సమస్యలను పరిష్కరించేం దుకు క్షేత్ర స్థాయిలో పరిశీ లనలు చేస్తూ నిజమైన సాగుదారులకు న్యాయం జరిగేలా సమగ్ర పరిశీలన అనంతరం సవరణలు చేయాలన్నారు. రీ-సర్వే మూడోదశ పనులు ప్రణాళికాబద్ధంగా చేపట్టి గ్రౌండ్ వాల్యుయేషన్ నోటిఫికేషన్ జారీ డ్రాఫ్ట్ ఆర్ ఓ ఆర్ జనరేట్, ఫైనల్ ఆర్వార్ జనరేషన్ ఈ కేవైసీ ప్రక్రియలు పూర్తిచేసి ఖచ్చితమైన డేటాతో వాస్తవంగా క్షేత్రస్థాయిలో, రికార్డులలో ఒకే విధమైన విస్తీర్ణాలు ఉండే విధంగా చర్యలు గైకొనాలన్నారు భూసరిహద్దుల స్పష్టత, ఆధునిక సాంకేతిక పరి జ్ఞానం వినియోగం ద్వారా ఖచ్చితమైన మ్యాపింగ్ చేయాలన్నారు. రీ సర్వే ప్రక్రియను భూ యజమా నుల సమక్షంలోనే చేయాలని సూచించారు అందుకు ప్రజల సహకారం ఈ కార్యక్రమానికి అత్యంత కీలకమన్నారు., కుల విచారణ అంశాలలో పారదర్శకత, న్యాయం పాటిస్తూ, అర్హులైన వారికి సమయానికి ధృవపత్రాలు జారీ చేస్తూ రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లను సకాలంలో విద్యా ఉద్యోగ అవకాశాలలో అమలు జరిగేలా చర్యలు తీసుకో వాలన్నారు డిజిటల్ రెవెన్యూ రిజిస్టరీ అమ లుతో భూ రికార్డులు పూర్తిగా డిజిటలైజ్ చేయడం మూలంగా ఎప్పుడైనా, ఎక్కడి నుండై నా రికార్డులను సులభంగా పరిశీలించే అవకాశం కలుగుతుందన్నారు భవిష్యత్తులో భూ లావాదేవీలు మరింత పారదర్శకంగా జరిగేలా ఈ ప్రక్రియ దోహదపడుతుంద న్నారు. జిల్లాలో రెవెన్యూ పరిపాలనను ప్రజా కేంద్రీకృతంగా మార్చేందుకు రెవి న్యూ సిబ్బంది పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ నిశాంతి, సర్వే ఏడి కే ప్రభాకర్ ఆర్డీవో జీ మమ్మీ కలెక్టరేట్ సిబ్బంది సుబ్బరాజు చినబాబు తదితరులు పాల్గొన్నారు

## జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మెగా రక్తదాన శిబిరం



**జగ్గంపేట, పెన్ పవర్, మార్చి 4:** జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ దేవరపల్లి చెన్నారావు ఆధ్వర్యంలో జంతుశాస్త్ర విభాగం ఆద్యాపకులు పి.శ్రీనివాస రావు, కాకినాడ రోటరీ బ్లడ్ బ్యాంక్ సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ రక్తదాన శిబిరానికి ముఖ్య అతిథిగా సీపీడీసీ కార్యదర్శి దేవరపల్లి సత్యనారాయణ మూర్తి, రిసోర్స్ పర్సన్ గా రోటరీ బ్లడ్ బ్యాంక్ నుండి విచ్చేసిన డాక్టర్ పి.కామరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ చెన్నారావు మాట్లాడుతూ రక్త దానం అత్యున్నత మానవ సేవ అని పేర్కొన్నారు. ముఖ్య అతిథి దేవరపల్లి మూర్తి మాట్లాడుతూ రక్తదానం ప్రాణాలను రక్షించే మహోన్నత సేవ అని, రక్తానికి ప్రత్యామ్నాయం లేదని అది మనుషుల నుండే లభిస్తుందని తెలిపారు. రక్తదాతలకు సర్టిఫికెట్ మరియు గుర్తింపు కార్డులు అందజేయడంతో పాటు ప్రతి దాతకు ఒక లక్ష రూపాయల బీమా రక్షణ కల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ స్వయంగా ముందుగా రక్తదానం చేసి విద్యార్థులకు ఆదర్శంగా నిలిచారు. బోధన మరియు బోధనేతర సిబ్బంది, అలాగే సుమారు 29 మంది విద్యార్థులు రక్తదానం చేసి సేవాభావాన్ని చాటారు.

ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ డా.పి. కామరాజు, కళాశాల ఐ. క్యూ.ఏ. సి కో-ఆర్డినేటర్ పి.వి.వి. సత్యా నారాయణ, అద్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గ్రామాలు పరిశుభ్రతతోనే ప్రజా ఆరోగ్య





**సర్పంచ్ మలిరెడ్డి అన్నపూర్ణ పాపారావు**

**గండేపల్లి, పెన్ పవర్, మార్చి, 4:** గ్రామాలు పరిశుభ్రతతోనే ప్రజా ఆరోగ్య లభిస్తుందని గ్రామ సర్పంచ్ మల్లీ రెడ్డి అన్నపూర్ణ పాపారావు అన్నారు. స్వచ్ఛ గ్రామం మన బాధ్యత ఇంటింటికి డస్ట్ బిన్ కంపెనీ కార్యక్రమంలో భాగంగా శ్రీ విజయలక్ష్మి బిబి ఆటో ఇండస్ట్రీ అధినేత బత్తిన శ్రీనివాస్ ఆర్థిక సహాయముతో గ్రామంలోని ప్రజలకు 1400 డస్ట్ బిన్ డబ్బాలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నివసించే గృహాలతో పాటు పరిసరాలు కూడా పరిసరగా ఉండాలని తద్వారా సంపూర్ణమైన ఆరోగ్యం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కె, హరికృష్ణ సత్య రెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాస్, కార్యదర్శి బి, సత్యనారాయణ, పీవీ శిరీష, పాలక వర్గ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com